



పవన్..అభివాదం

బహిరంగ సభలో పవన్ అభివాదం..పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్

నెలాఖరు వరకు స్మార్ట్ రేషన్ కార్డులు

రాజమహేంద్రవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రేషన్ కార్డుదారులు ఈ నెలాఖరులోగా తమ స్మార్ట్ రేషన్ కార్డులను తప్పనిసరిగా తీసుకోవాలని జేసీ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. పాత రేషన్ కార్డుల స్థానంలో 5,59,348 స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం జిల్లాకు పంపిందన్నారు. కొందరు ఇతర ప్రాంతాలకు ఉపాధి నిమిత్తం వెళ్లడం, తమ కార్డులు ఏ సచివాలయంలో ఉన్నాయో తెలియకపోవడం వంటి కారణాలతో 29,107 కార్డులు ఇప్పటికీ పంపిణీ కాలేదని చెప్పారు. కార్డు పొందని వాళ్లు సమీప సచివాలయానికి వెళ్లి కుటుంబీకుల్లో ఒకరిది వేలిముద్ర లేదా ఓటీపీ ధ్రువీకరణ ద్వారా స్మార్ట్ కార్డు పొందాలన్నారు. జిల్లాలోని రేషన్ కార్డుల్లో 15,85,090 మంది సభ్యులు ఉండగా వారిలో 57,022 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. దగ్గరలోని రేషన్ షాపులో ఈ పోస్ యంత్రం ద్వారా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు.

రేపు జాబ్ మేళా

రాజమహేంద్రవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని మోడల్ కేరీర్ సెంటర్ ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి కె.హరిశ్చంద్ర ప్రసాద్ బుధవారం తెలిపారు. సెరా కేర్ హ్యాపీలైఫ్, గూగుల్ పే సంస్థల్లోని ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ విద్యార్హతలు, 19-35 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు హాజరు కావొచ్చన్నారు. https://tinyurl.com/jf1may25 లింక్ ద్వారా రిజిస్టరు చేసుకోవాలన్నారు. వివరాలకు 95332 21189 నెంబరులో సంప్రదించాలన్నారు.



డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగులపై పెరుగుతున్న పని ఒత్తిడి తగ్గించాలని ఏపీజీఈఏ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులపై పెరుగుతున్న పని ఒత్తిడి అంశంపై నిర్వ హించిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ మాట్లాడారు. వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో సర్వేలు చేయలేదని.. జిల్లాలోని 40 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం అన్యాయమన్నారు. పనిభారం తగ్గించాలని కోరారు. డీఆర్వో సీతారామమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సూర్య, మహిళా విభాగం కో కన్వీనర్ సీత, నగర నాయకులు పాల్గొన్నారు.

30 వరకు సర్వే : పీడీ

దివాన్‌చెరువు, నవంబరు26 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో గృహాల మంజూరుకు జరుగుతున్న సర్వేను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ నాతి బుజ్జి తెలిపారు. దివాన్‌చెరువులో జరుగుతున్న పీఎంఏవై2.0 (గ్రామీణ్) సర్వేను బుధవారం ఆకస్మికంగా పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 30వ తేదీలోగా సర్వే పూర్తిచేయాలన్నారు. అర్హులైన పేదలను మాత్రమే ఎంపిక చేయాలని సిబ్బందికి సూచించారు. ఎక్కడా అవకతవకలకు తావుండకూడదన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ సంస్థ మండల వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మీ కోసమే వచ్చామయ్యా : రాజోలు నియోజకవర్గం శివకోడులో బహిరంగ సభకు హాజరైన ప్రజానీకం





జన..పవనాలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

పవన్ వచ్చారు.. హామీలిచ్చారు.. మీకు అండగా నేనున్నా.. మీ సమస్యలన్నీ పరిష్కరిస్తానంటూ భరోసానిచ్చారు.. ఏపీ డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారిగా రాజోలు నియోజకవర్గంలో పర్యటించిన పవన్‌కల్యాణ్‌కు జనం అడుగడుగునా నీరాజనం పలికారు. మలికిపురం మండలం గూడపల్లిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు బుధవారం ఉదయం 10.30 గంటలకు చేరుకున్న ఆయన తిరిగి శివకోడులో బహిరంగ ముగించుకుని నాలుగు గంటల అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు హెలికాప్టర్‌లో అమరావతి పయనమై వెళ్లారు. గూడపల్లిలో హెలికాప్టర్ దిగిన తరువాత కేశనపల్లి వంతెన పై నుంచి ఉప్పునీటితో చనిపోయిన కొబ్బరిచెట్లను పరిశీలించి గంటన్నర సేపు రైతులతో ముఖాముఖిగా ముచ్చటించారు. శంకరగుప్తం డ్రెయిన్ మూలాలను అడిగి తెలుసుకుని 45 రోజుల వ్యవధిలో ప్రణాళికలు రూపొందించి కొబ్బరి రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని స్పష్టత ఇచ్చారు. అనంతరం అక్కడి నుంచి రాజోలు మండలం శివకోడుకు వచ్చే ప్రాంతంలో ఎన్నో సమస్యలు గుర్తించారు. కూనవరంలో శిథిల శివాలయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ప్రకటించారు. పల్లెపండుగ 2.0 ప్రారంభంతో పాటు కోనసీమలో రహదారుల అభివృద్ధికి అదనంగా రూ.100 కోట్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే వాడపల్లి ఆలయానికి వెళ్లే ఏటిగట్టు రోడ్డు అభివృద్ధికి రూ.6 కోట్లు విడుదల చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఓఎన్జీసీ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా..కోనసీమలో రైల్వేలైన్ ఏర్పాటు ఆవశ్యకతను ప్రస్తావించారు. శివకోడుసభలో 1:15 గంటల పాటు పవన్ ప్రసంగం ఆకట్టుకుంది. పవన్ ప్రసంగం సమయంలో అభిమానులు కేరింతలు, హర్షధ్వానాలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది.

అడుగడుగునా నీరాజనం

- 4 గంటల పాటు పర్యటన
- అభిమానుల ఎదురుచూపులు
- సమస్యల పరిష్కారానికి చర్యలు
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కొబ్బరి రైతుల బాధ్యత నాది..

కొబ్బరి రైతులెవరూ రోడ్డెక్కకుండా కాపాడే బాధ్యత నాది అంటూ భరోసా ఇచ్చారు. కేరళ తరహా ప్రకృతి అందాలతో అలరారే కోనసీమలో బ్యాక్ వాటర్ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. సినిమా షూటింగ్‌లకు అనువైన పరిస్థితులున్నాయి.కొబ్బరి రైతులకు కోకోనట్ బోర్డు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

నాటి చిరు దీపమే.. నేడు కీలకం..

2019 ఎన్నికల్లో నేను ఓడిపోయాను. రాజోలు నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిని గెలిపించి చీకట్లో ఒక చిరుదీపాన్ని వెలిగించారు. కానీ ఆ ఎమ్మెల్యే వేరే పంచకు చేరారు. ఆనాటి చిరు దీపమే ఈ రోజు కూటమి ప్రభుత్వం ఏర్పాటులో కీలకమైందని పవన్ ప్రస్తావించారు.

నిధులు..వరదలా..

రాష్ట్రంలో రూ.6,787 కోట్ల అంచనాతో పల్లెపండుగ కార్యక్రమం చేపడుతున్నాం. రూ.5,838 కోట్ల అంచనాతో 8,571 కిలోమీటర్ల రోడ్లు నిర్మిస్తున్నాం. రూ.4 కోట్లతో 58 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. పంచాయతీల పరిధిలో రూ.406 కోట్లతో 15 వేల కొత్త అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. రూ.148 కోట్లతో డీపీఆర్సీ, పంచాయతీ భవనాలు నిర్మిస్తాం'. కోనసీమకు అదనంగా రూ.100 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నాం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డ్రెయిన్లు, పంట కాల్వల ఆధునికీకరణకు రూ.4 వేల కోట్లు అవసరం.









యువతుల కేరింత.. తుళ్లింత



శివకోడు సభలో ప్రసంగిస్తున్న పవన్ చిత్రంలో ఎంపీ హరీష్, ఎమ్మెల్యేలు బొమ్మిడి నాయకర్, దేవవర ప్రసాద్, అయితాబత్తుల, గిడ్డి సత్యనారాయణ



మేం జన సైనికులం : జనసేన ఎంబ్లమ్‌తో మహిళల ఉత్సాహం



ప్లకార్డులతో కూటమి ద్వయం

నీటి పారుదల వ్యవస్థ ఆధునీకరణకు చర్యలు

జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో ఎంపీ

రాజమహేంద్రవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల వ్యవస్థ ఆధునికీకరణ.. పశ్చిమ, తూర్పు డెల్టా కాలువల్లో మరమ్మతులపై సమగ్ర దృష్టి సారించాలని.. ఏజెన్సీలకు అప్పగించకుండా అధికారులే స్వయంగా డీపీఆర్ సిద్ధం చేయాలని ఎంపీ పురందేశ్వరి ఆదేశించారు. జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో బుధవారం ఆమె మాట్లాడారు. గోదావరి డెల్టాలోని మొత్తం 8,96,507 ఎకరాలకు అవసరమయ్యే 93.26 టీఎంసీల నీటి లభ్యత, సీలేరు, పోలవరంలో నిల్వలు, డిసెంబరు-మార్చి కాలంలో అంచనా ఇన్‌ఫ్లోస్ వంటి అంశాలపై సమీక్షించామన్నారు. ఓ అండ్‌ఎం, ఆర్‌ఆర్‌ఆర్, ఆధునికీకరణ పనులు అంతర్‌జిల్లా అధికారుల సమన్వయంతో జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్ ఇంజనీర్లు కలిసి సమీక్షలు నిర్వహిస్తేనే గోదావరి డెల్టాలోని సంక్లిష్ట నీటి పారుదల వ్యవస్థ స్థిరత్వం సాధ్యమవుతుందన్నారు.కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ రబీ సీజన్ పంటసాగు సమయానికి అవసరమైన నీటి పంపిణీ, కాలువల సంరక్షణ, ఇంజినీరింగ్ పనులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను శనివారానికి సమర్పించాలని ఆదేశించారు. జేసీ మేఘ స్వరూప్ ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే, ఇంజినీరింగ్ సిబ్బందిని సమన్వయం చేసి 60 రోజుల్లో సమగ్ర డీపీఆర్ సిద్ధం చేయాలని సూచించారు. షట్టర్ల మరమ్మతులు, బండ్‌ల పటిష్టత, కాటన్ మ్యూజియం నిర్వహణ వంటి అంశాల్లో దీర్ఘకాలిక పరిష్కారాలకు ప్రత్యేక నివేదికలు సిద్ధం చేయాలన్నారు. షట్టర్ల మరమ్మతుల పనులు పూర్తి నాణ్యతతో చేయాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు సూచించారు. బురద కాలువ సమస్యల వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రస్తావించారు. తొర్రిగెడ్డ, చాగల్నాడు, పుష్కర ప్రాజెక్టులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గోదావరి ఘాట్లు, ధవళేశ్వరం బ్యారేజ్‌లోని 175కి 115 గేట్లకు అనివార్యంగా మరమ్మతులు అవసరమన్నారు. ఇరిగేషన్ ఎస్‌ఈ గోపీనాథ్ గోదావరి డెల్టా సిస్టంకు సంబంధించిన ఆయకట్టు, నీటి అవసరత, టీఎంసీ లభ్యత, సీలేరు-పోలవరం లింక్‌ల వివరాలను సమగ్రంగా వివరించారు. తూర్పు, పశ్చిమ డెల్టాలు, తొర్రిగెడ్డ పంపింగ్ వ్యవస్థ, కొవ్వాడ కాలువల పరిధిలోని 73,236 ఎకరాలకు 7.324 టీఎంసీల నీరు అవసరత ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఈస్టర్న్ డెల్టా చైర్మన్ సునీల్ కుమార్, డీఆర్వో సీతారామమూర్తి, ఆర్డీవోలు కృష్ణ నాయక్, రాణి సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు కృషి : ఎంపీ



పూల పరిశోధన కేంద్రం పరిశీలనలో ఎంపీ

కడియం/ధవళేశ్వరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పూల పరిశోధన కేంద్రంకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా కృషి చేస్తామని ఎంపీ పురందేశ్వరి తెలిపారు. వేమగిరి పూల పరిశోధనా కేంద్రంను బుధవారం పరిశీలించారు. పూల పరిశోధన కేంద్రం రీసెర్చి పార్క్, లేబోరేటరీలను చూశారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ త్వరలో రైతులకు ఉపయోగపడే విధంగా ఉద్యాన అధికారులతో ఓ సమావేశం నిర్వహిస్తామన్నారు. శాస్త్రవేత్తలు డా. రాంపాల్, డా. లక్ష్మీపతి, డా. శిరీష, డా. మాధవన్ మాట్లాడుతూ రైతులకు జీవనియంత్రణ పద్ధతులపై వివరిస్తున్నట్టు తెలిపారు. ప్రతి నర్సరీ రైతు విధిగా తమ పేరును హార్టికల్చర్ ఏడీ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలన్నారు. ధవళేశ్వరంలో క్వాయర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని సందర్శించారు.

ప్యాకేజీ 2 పనులపై దృష్టి పెట్టండి..

రాజమహేంద్రవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాల దృష్ట్యా బుట్టాయగూడెం -ఎల్ఎన్‌డీ పేట- పట్టిసం-కొవ్వూరు (ఎన్‌హెచ్ 365బీబీ) రహదారి అభివృద్ధి ప్యాకేజీ-2 పనులను పూర్తి చేయాలని ఎంపీ పురందేశ్వరి ఆదేశించారు. కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో బుధవారం సమీక్షించారు.కేంద్ర ప్రభుత్వం తరఫున అవ సరమైన అనుమతులు, సాంకేతిక ఆమోదాలు, నిధుల విడుదలపై సమన్వయం చేసే బాధ్యతను తాను స్వయంగా తీసుకుంటానని చెప్పారు. కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు చేసిన సూచనలను మినిట్స్ రూపంలో నమోదు చేసి వెంటనే సంబంధిత శాఖలకు పంపించాలన్నారు.ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, నాణ్యత నియంత్రణ అత్యవసరమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు.




రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి

అంబేడ్కర్ ఆశయాలు అనుసరణీయం

కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విలువలను అనుసరించి ప్రతి ఒక్కరూ నిబద్ధతతో కలిగి ఉండాలని కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘా స్వరూప్ అన్నారు. 76వ భారత రాజ్యాంగ దినోత్సవం కలెక్టరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు.1950 జనవరి 28న అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం, సమగ్రత, సమానత్వం, న్యాయం స్వేచ్ఛ, విలువలు ప్రతిబింబించే మహోత్తర గ్రంథం అన్నారు. మన భారత రాజ్యాంగాన్ని స్వీకరించ డం మాత్రమే సరిపోదని అందులో నిర్దేశించిన విలువలను మన జీవన విధానంలో ఆచరిస్తేనే అది సాకారమవుతుందన్నారు. రాజ్యాంగం ఎంత మంచిదైనా దాన్ని అమలు పరిచే వారు చెడ్డవారైతే అది తప్పక చెడిపోతుందని డాక్టర్ బీఆర్ అండేడ్కర్ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. రాజ్యాంగం ప్రతి అధికారికి ప్రతి పౌరుడికి స్పష్టమైన విధులు..బాధ్యతలు నిర్దేశించిందని మేఘస్వరూప్ అన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో సీతారామమూర్తి, కె.భాస్కర్‌రెడ్డి, డీఈవో వాసుదేవరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జ్యోతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎ వాణి పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవం



షష్ఠి ఉత్సవాలు ఊరువాడా ఘనంగా జరిగాయి. బిక్కవోలు, అనపర్తి, రాజమహేంద్రవరం, నిడదవోలు, కొవ్వూరు, ఉండ్రాజవరం మండలాల్లో ఆలయాలకు భక్తజనం పోటెత్తారు. బిక్కవోలులో స్వామి ఊరేగింపు.. 7

ఘనంగా డైమండ్ జూబ్లీ ఉత్సవం



నిడదవోలు పురపాలక సంఘం డైమండ్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.. బుధవారం మంత్రులు దుర్గేష్, నారాయణ, కలెక్టర్ కీర్తి చేకూరి హాజరై స్తూపం ఆవిష్కరించారు. 6

సమస్యలన్నీ తీరుస్తా..



ఇన్ని సమస్యలా : మలికిపురం మండలం కేశనపల్లిలో ఫొటో ఎగ్జిబిషన్‌లో సమస్యలు చూసి ఆవేదన చెందుతున్న పవన్, చిత్రంలో ఎంపీ, కలెక్టర్ తదితరులు

- కోనసీమ పర్యటనలో పవన్
- రైతాంగ సమస్యలపై అధ్యయనం
- శాశ్వత పరిష్కారానికి చర్యలు
- కొబ్బరి చెట్ల పరిరక్షణ బాధ్యత అందరిదీ
- 13 గ్రామాల్లో బాధిత రైతులతో భేటీ
- సమస్యలు విన్నారు..నిధులిస్తామన్నారు..

అమలాపురం/మలికిపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'సంస్కృతీ, సంప్రదాయాల్లో భాగమైన కొబ్బరిచెట్లను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. కోనసీమ కొబ్బరి రైతాంగ సమస్యలపై సమగ్రంగా అధ్యయనం చేసి శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందిస్తాం' అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గ పరిధిలోని చింతలమోరి, కేశనపల్లి గ్రెయిన్‌లో ఉప్పు నీటి సాంద్రత వల్ల వేలాది కొబ్బరి చెట్లు నిర్జీవమైన పరిస్థితులను బుధవారం ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. కేశనపల్లిలోని వ్యూ పాయింట్ నుంచి రైతులకు జరిగిన నష్టాన్ని కళ్లారా చూశారు. కూటమి ప్రభుత్వం కొబ్బరి రైతులకు అండగా ఉంటుందన్నారు. 13 గ్రామాల్లో పంట నష్టపోయిన రైతులతో భేటీ అయ్యారు. రైతుల సమస్యలు విన్న తర్వాత పవన్‌కల్యాణ్ మాట్లాడారు. 'నేను గతంలో కోనసీమ ప్రాంతంలో పర్యటించినప్పుడు శంకరగుప్తం డ్రెయిన్ సమస్య ఇంత తీవ్రంగా లేదు. సమస్య నా దృష్టికి వచ్చిన తర్వాత సమగ్ర అధ్యయనం చేసి శాశ్వత పరిష్కారాలు అన్వేషించాలని భావించా. సమస్యలపై మూలాల నుంచి అవగాహన తెచ్చుకుంటే తప్ప శాశ్వత పరిష్కారం చేయలేం' అని పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. 'ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డ్రెయిన్లు, పంట కాల్వల ఆధునికీకరణకు రూ.4 వేల కోట్లు అవసరమని అధికారులు తెలిపారు. శంకరగుప్తం డ్రెయిన్ యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టేందుకు రూ.20.68 కోట్లు అవసరం ఉందన్నారు. 14 ఏళ్లుగా ఉన్న శంకరగుప్తం డ్రెయిన్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టిసారిస్తానన్నారు. నీటిపారుదలశాఖ నిపుణుడు డీసీ రోశయ్య రాసిన రిపోర్టుపై రెండు వారాల్లో అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించా రు. డిసెంబరు రెండో వారంలో ఈ సమస్యపై అధికారులు, రైతులతో మరోసారి సమావేశం నిర్వహిస్తాం' అని పవన్ ప్రకటించారు. 'కొబ్బరి రైతుల సమస్యలపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ వేస్తాను. 45 రోజుల్లో వారి సమస్యలపై శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తాం. సంక్రాంతి తర్వాత యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తాను' రైతుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ 22 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఈ శంకరగుప్తం డ్రెయిన్ మధ్యలో ఎనిమిదిన్నర కిలోమీటర్లు డ్రెడ్జింగ్ చేయాలని, డ్రెయిన్‌కు ఇరువైపులా గట్లు ఎత్తు చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. జలవనరులశాఖ మంత్రి, టెక్నికల్ సిబ్బంది పరిశీలించి రూ.22 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆర్థికశాఖకు పంపారన్నారు. మీరు కల్పించుకుంటే వెంటనే నిధులు మంజూరవుతాయని, శంకరగుప్తం డ్రెయిన్ విధ్వంసం నుంచి రైతులు ఉపశమనం పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ హరీష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఉద్యానవన కమిషనర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



మీకే నేనున్నా : కొబ్బరి రైతుల సమస్యలు వింటున్న పవన్



మీ ముప్పు తీరుస్తా : ఉప్పుటేరు పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్





జన హారతి : పవన్ రాకకు మహిళల ఎదురుచూపులు



అన్నొస్తాడని : పవన్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులు



సమస్యలు చెబుతాం : ముఖాముఖి సమావేశానికి రైతులు



నేనున్నా..చూసుకుంటా : సమస్యల పరిశీలనకు కాలినడకన వెళుతూ పవన్ అభివాదం

రైతాంగ సంక్షేమమే లక్ష్యం : ఎంపీ హరీష్



రైతాంగ సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల సమయంలో రాజోలు నియోజకవర్గానికి పవన్ కల్యాణ్ వచ్చినప్పుడు పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నాను గానీ నాకు రాజోలు నియోజకవర్గం అంటే చాలా ఇష్టమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి రేయింబవళ్లు కష్టపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఎక్కడా జరగలేదు.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా పయనిస్తుంది..

పవన్ గుండెచప్పుడు..రాజోలు : ఎమ్మెల్యే దేవ



రాజోలు నియోజకవర్గానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రావడం చాలా సంతోషదాయకం. పవన్‌కల్యాణ్ ఆశయాలను నిలబెట్టింది మొట్టమొదటిసారిగా రాజోలు నియోజకవర్గ ప్రజలు.. డిప్యూటీ సీఎం పవన్‌కు రాజోలు నియోజకవర్గం గుండెకాయ వంటిది. నియోజకవర్గంలో వరి పంట 14 ఎకరాల్లో పండేది.. అటువంటిది 6 వేల ఎకరాల్లో వరి పండడంలేదు. ప్రతీ గ్రామంలో మంచినీటి ఎద్దడి నెలకొంది. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఎటువంటి చర్యలు తీసుకోలేదు. నియోజకవర్గంలో వంద మంది డయాలసిస్ పేషెంట్లు ఉన్నారు. నియోజకవర్గానికి ఒక మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి కావాలి.

స్ఫూర్తివంతమైన 2.0 : కలెక్టర్



ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతోనే అభివృద్ధి బాట పడతాయి. పల్లెపండుగ 1.0లో సత్ఫలితాలకు కొనసాగింపుగా 2025 నవంబరు 26న ప్రారంభిస్తున్న పల్లె పండుగ 2.0కి ఇది స్ఫూర్తివంతమైన బాట వేసింది.

స్వర్ణ పంచాయతీలకు అడుగులు : సీఎస్



రెండో విడత బృహత్తర కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ నేతృత్వంలో కొత్త ప్రణాళికతో పనులు చేపట్టడానికి గ్రామాలు సిద్ధంగా ఉన్నాయి. రూ.6,787 కోట్లతో గ్రామగ్రామాన పల్లెపండుగ 2.0 అమలు జరుగుతుంది.స్వర్ణ గ్రామ పంచాయతీల ఏర్పాటుకుప్రభుత్వం అడుగులు వేస్తుంది.

సర్వనాశనమైపోయాం..



శంకరగుప్తం డ్రెయిన్ విధ్వంసం వల్ల సర్వనాశనమైపోయాం. మీరు తలచుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మా సమస్యను పరిష్కరిస్తాయి. రూ.22 కోట్లు కేటాయిస్తున్నామంటున్నారు. అది సరిపోదు.

- యెనుముల నాగు, సర్పంచ్, కేశనపల్లి

భూగర్భ జలాలు కలుషితం..



శంకరగుప్తం డ్రెయిన్ ఉప్పునీరు ఆటుపోట్లకు భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. భవనాలు బీటలు వారుతున్నాయి. కొబ్బరి పంట ఆదాయం కోల్పోయాం. మమ్మల్ని గట్టెక్కించాలి.

- అడబాల నాని, రైతు, కేశనపల్లి

చమురు సంస్థలతో ముప్పు



ఓఎన్జీసీ, గెయిల్, సీస్మిక్ సర్వేల వల్ల భూమి కుంగిపోతోంది. చమురు నిక్షేపాలను తరలించుకుపోతున్నారు. ఈ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదు. మీరే మాకు న్యాయం చేయాలి.

- డాక్టర్ నాగయ్య యాదవ్, కేశనపల్లి రైతు

డ్రెయిన్‌ను డ్రెడ్జింగ్ చేయాలి



శంకరగుప్తం డ్రెయిన్‌ను డ్రెడ్జింగ్ చేయాలి. గట్లు ఎత్తు చేస్తే ఉప్పునీరు గ్రామాలు, తోటల్లోకి రాదు. చనిపోయిన కొబ్బరిచెట్లకు పరిహారమివ్వాలి. రైతులను ఆదుకోవాలి.

-చినవెంకన్నాయుడు, మాజీ సర్పంచ్, పడమటిపాలెం

సత్యదేవా నర్సరీలో కేరళ బృందం



నర్సరీని సందర్శిస్తున్న బృందం

కడియం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడియపులంక పుల్లా చంటియ్య - సత్యదేవా నర్సరీని బుధవారం కేరళ రాష్ట్ర రూరల్ లైవ్ లీహుడ్ మిషన్ (ఎస్ఆర్ఎల్ఎం) 40 మంది బృందం సందర్శించారు. నర్సరీ ఎండీ పుల్లా పెదసత్యనారాయణ వారికి స్వాగతించారు. మొక్కల పెంపకం, ఏఏ ప్రాంతంలో ఎటువంటి మొక్కలు పెంపకానికి అనువుగా ఉంటుందని తెలుసుకున్నారు. నర్సరీలో స్వదేశీ, విదేశీ మొక్కలు చూసి వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్వీవీఎస్ మూర్తి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, పుల్లా రామకృష్ణ, డీఆర్‌డీఏ అధికారులు, తదితరులు ఉన్నారు.

నూతన నటీనటులతో కల్ట్ సినిమా : దర్శకుడు



క్లాప్ కొడుతున్న నటుడు దత్తు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ నేపథ్యంలో అస్త్ర మూవీ మేకర్స్ బ్యానర్లో నూతనంగా నిర్మిస్తున్న కల్ట్ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం కాకినాడ దేవాలయం వీధిలోని పెద్ద శివాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం హీరో, హీరోయిన్లు శ్రీమంత్, అక్షరపై దర్శకుడు హరీష్ క్లాప్ కొట్టి సినిమాను ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు హరీష్ మాట్లాడుతూ నూతన నటీనటులతో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్టు పేర్కొన్నారు. చిత్రానికి సహనిర్మాతగా బీవీఎస్ఎస్ ప్రసాద్, కెమెరామెన్‌గా లోకేష్ వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా సహ నిర్మాత ప్రసాద్, హీరో, హీరోయిన్లు మాట్లాడుతూ యువతలో క్రికెట్ పట్ల ఉండే ఇష్టం ఆధారంగా ఆసక్తికర కథనంతో సినిమాను తెరకెక్కించడం జరుగుతోందన్నారు. ఇది అందరికీ నచ్చే విధంగా చిత్రం ఉంటుందన్నారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లోని నటీనటులకు అవకాశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. సినీ నటుడు దత్తు, స్టీవిన్, మధు, లోవేశ్వరరావు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

నిడదవోలును స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా మారుస్తాం

- వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి నారాయణ ప్రకటన
- కూటమి ప్రభుత్వంలో పురపాలక సంఘంలో రూ. 151 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు : మంత్రి దుర్గేష్



మాట్లాడుతున్న మంత్రి పొంగూరి నారాయణ

నిడదవోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పురపాలక సంఘ వజ్రోత్సవ వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని, దీన్ని స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తామని, ఉత్సవాలు పూర్తయ్యే నాటికి (ఈ నెల 28వ తేదీ సాయంకాలానికి) మున్సిపాలిటీ అప్‌గ్రేడ్ జీవో కాపీని అందిస్తామని పురపాలక శాఖ మంత్రి పొంగూరి నారాయణ ప్రకటించారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని ఐ లవ్ నిడదవోలు పార్కు వద్ద నిడదవోలు వజ్రోత్సవ చిహ్నాన్ని మంత్రి దుర్గేష్‌తో కలసి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన వజ్రోత్సవ వేడుకల వేదికపై ఆయన మాట్లాడుతూ నిడదవోలు పట్టణానికి పూర్వవైభవం తీసుకురావడానికి కలసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి కందుల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే 400 కోట్ల రూపాయిలతో నిడదవోలు నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చామన్నారు. ఒక్క నిడదవోలు పట్టణంలోనే రూజ 151 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, త్వరలో నిడదవోలును అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పరుస్తామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఆలోచనలకు అనుగుణంగా పట్టణాన్ని అభివృద్ధి పరచడంలో తాను ప్రజా సేవకుడిగా పనిచేస్తున్నానన్నారు. త్వరలోనే నిడదవోలు ప్రజలకు గోదావరి జలాలను అందించడంతో పాటు మినీ స్టేడియం ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటున్నానన్నారు. అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్ట్‌లో అంతర్భాగంగా రూ. మూడు కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణాభివృద్ధికి మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కృష్ణవేణి, కౌన్సిలర్లు కష్టపడి పనిచేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. సభా వేదికపై సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జునరావు రచించిన నిడదవోలు చరిత్ర పుస్తకాన్ని మంత్రులు నారాయణ, దుర్గేష్, తదితరులు ఆవిష్కరించారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఆర్డీవో రాణీసుస్మిత, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎంతో సంతృప్తినిచ్చింది

- రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్

నిడదవోలు పురపాలక సంఘ వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొనడం సంతృప్తినిచ్చిందని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఐ లవ్ నిడదవోలు పార్కు వద్ద ఉన్న వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలకు మంత్రి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ తోట కృష్ణవేణి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి రూ.25లక్షలతో స్వర్ణ వేలాయుధం

- సంకల్పించిన భక్తుడు కంబాల శ్రీనివాసరావు
- తొలుత రూ.13 లక్షలతో 100 గ్రాముల బంగారం కొనుగోలు



స్వామివారికి బంగారాన్ని సమర్పిస్తున్న కంబాల శ్రీనివాసరావు దంపతులు

కోరుకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ ప్రధాన రహదారిలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి రూ.25 లక్షలతో స్వర్ణ వేలాయుధం చేయించడానికి భక్తుడు, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు సంకల్పించారు. గురువారం కోరుకొండలో ప్రారంభమైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవలే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయ నూతన పునఃప్రతిష్ఠ జరిగిందన్నారు. అప్పుడు ఆలయాన్ని సందర్శించినప్పుడు స్వామివారి చేతిలో ఉండే ఆయుధమైన వేలాయుధం రూ.25 లక్షల వ్యయంతో చేయిస్తానని ప్రకటించానన్నారు. అప్పటి మాజీ సర్పంచ్ కటకం చలంకి లక్ష రూపాయలు విరాళం అందజేశానని, ఆయన వాటితో తులం బంగారం కొనుగోలు చేశారన్నారు. కాగా, మంగళవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి రాజమహేంద్రవరం బీమ జ్యువెలర్స్‌లో రూ.13 లక్షలతో 24 క్యారెట్ల 100 గ్రాములు బంగారాన్ని కొనుగోలు చేశారన్నారు. ఈ బంగారాన్ని షష్ఠి సందర్భంగా స్వామివారి సన్నిధిలో పెట్టామన్నారు. అలాగే డిసెంబర్ నెలలో మరో 14 తులాల బంగారాన్ని కొనుగోలు చేసి మొత్తం 25 తులాల బంగారంతో వేలాయుధం తయారు చేయించి, కోరుకొండ మండలంలో ప్రతి గ్రామానికి ప్రజల దర్శనార్థం ఊరేగించి, స్వామివారిని అలంకరిస్తామన్నారు. అలాగే కాప వీరబాబు అనే వ్యక్తి గత రెండేళ్ల క్రితం రథం కిందపడి కాలు నలిగిపోయి కాలును తొలగించారు. కంబాల శ్రీని వాసరావు వద్దకు వచ్చి సహాయం చేయాలని కోరగా స్పందించిన ఆయన జైపూర్ నుంచి లక్ష రూపాయలు వ్యయంతో కృత్రిమ కాలును తెప్పిస్తున్నట్టు తెలిపారు. ఆలయ బ్రాహ్మణులు ఉండటానికి వసతి గృహాన్ని నిర్మించాలని కమిటీ సభ్యులు కోరగా, నిర్మాణానికి సహాయం అందిస్తానని ప్రకటించారు. అనంతరం రామసేన కార్యాలయం వద్ద భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

కఠినమైన అభ్యాసం అవసరం

- ఆంధ్రా విశ్వవిద్యాలయం సీఎస్‌సీఇ విశ్రాంత ఆచార్యులు పీఎస్ అవధాని



సెమినార్‌లో ప్రసంగిస్తున్న విశ్రాంత ఆచార్యులు అవధాని

దివాన్‌చెరువు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పరిశ్రమ ప్రమాణాలను అందుకోవడానికి కఠినమైన అభ్యాసం అవసరమని ఆంధ్రా విశ్వవిద్యాలయం సీఎస్‌సీఇ విశ్రాంత ఆచార్యులు పీఎస్ అవధాని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల, సైన్స్ అండ్ హ్యూమనిటీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రోగ్రామింగ్ స్కిల్స్ అనే అంశంపై ఒకరోజు సెమినార్‌ను బుధవారం నిర్వహించారు. ఈసమావేశంలో కీలక ఉపన్యాసకులుగా అవధాని పాల్గొని ప్రసంగించారు. అనంతరం వీసీ ఆచార్య ప్రసన్నశ్రీని కలసి విశ్వఇద్యాలయానికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. ఈసందర్భంగా అవధానిని వీసీ ప్రసన్నశ్రీ సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, డీన్ పి. సురేష్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.

అండర్ - 19 కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఎస్‌కేఆర్ మహిళా కళాశాల విద్యార్థినులు

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వతంత్ర హాస్పిటల్ దగ్గరలో గల అంబేడ్కర్ ఈ భవన్‌లో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ -19 కరాటే ఉమెన్ స్టేట్ సెలెక్షన్స్‌లో శ్రీ కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల విద్యార్థినులు కేటగిరీ 52 విభాగంలో వేముల వంశిక లక్ష్మి (ఇంటర్ సిఇసి రెండో సంవత్సరం),గోల్డ్ మెడల్ కేటగిరీ 68వ విభాగంలో పాయం కీర్తన (ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం), అలాగే సిల్వర్ మెడల్ సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల డిసెంబరు 12వ తేదీ నుంచి 16 వరకు మధ్యప్రదేశ్‌లో జరగబోయే కరాటే నేషనల్స్‌లో వేముల వంశిక లక్ష్మికళాశాల తరఫున పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్లు వై.సుధారాణి, నాగు, కరాటే కోచ్ అరుణ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో అచ్చంపేట క్రీడాకారుడు ప్రతిభ



డబుల్స్ చాంపియన్ షిప్‌లో పతకం పొందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు హరికృష్ణ

సామర్లకోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యానెక్స్-సన్‌రైజ్ 48వ జూనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్-2025 పోటీలు అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఇటానగర్‌లో ఈ నెల 20వ తేదీ నుంచి 25వ తేదీ రాత్రి వరకు జరిగాయి. ఇందులో కాకినాడ జిల్లా సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన వీరంరెడ్డి హరికృష్ణ, చిత్తూరు జిల్లాకు చెందిన తిప్పన చరణ్‌రామ్ అండర్-19 కేటగిరీ డబుల్స్ విభాగంలో కాంస్యపతకాన్ని కైవసం చేసుకున్నారు. బుధవారం రాత్రి ఇటానగర్ నుంచి రైలులో సామర్లకోట చేరుకున్న అచ్చంపేట క్రీడాకారుడు హరికృష్ణకు అదే గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు జిల్లా క్రీడాకారులు ఘనంగా స్వాగతం పలికి అభినందించారు. హరికృష్ణ హైదరాబాద్‌లోని ఒక జాతీయ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. వీరిని పలువురు అభినందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరా.. శరణు.. శరణు

అంగరంగ వైభవంగా

శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలు

భక్తులతో పోటెత్తిన బిక్కవోలు

బిక్కవోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగురాష్ట్రాల్లో పేరొందిన తూర్పుగోదావరి జిల్లాలోని బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున 1.10 గంటలకు స్వామివారి తీర్థపు బిందె సేవతో ఉత్సవకమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం భక్తులకు స్వామి దర్శనాలు కల్పించారు. తెల్లవారుజామునుంచే భక్తులు ఆలయం 3వైపులా బారులు తీరారు. సంతానార్థులైన స్త్రీలు స్వామి పుట్టపై ఉంచిన నాగుల చీరను ధరించి ఆలయం వెనుక శయనించారు. ఉదయం 7.20 గంటలకు స్వామివారిని మయూర వాహనంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. 10 గంటల నుంచి 4 గంటల వరకూ షష్ఠి కళావేదికపై కేరళ చండీ వాయిద్యాలు, ఉమ్మలాడ, భీమవరం, దువ్వ, బిక్కవోలు వారిచే నిర్వహించిన బ్యాండు కచేరీలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం 5 గంటల వరకూ కాల్చిన బాణసంచా కనువిందు చేసింది. లక్షకు పైగా భక్తులు స్వామిని దర్శించుకున్నారని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు.

దర్శించిన ప్రముఖులు..

స్వామివారిని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, దేవదాయశాఖ ఆర్‌జేసీ వి.త్రినాధరావు, డిప్యూటీ కమిషనర్ డి.రమేష్‌బాబు, డీఈవో ఈవి సుబ్బారావు, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్ బిఎం మురళీకృష్ణ, డీఎస్పీ బి.విద్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ లావణ్య దర్శించుకున్నారు. 300 మందితో బందోబస్తు ఏర్పాట్లు చేశామని అనపర్తి సీఐ సుమంత్, బిక్కవోలు ఎస్ఐ రవిచంద్రకుమార్ తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి



కనువిందు చేసిన బాణసంచా..

షష్ఠి ఉత్సవాల్లో భాగంగా గ్రామానికి చెందిన గోలింగేశ్వరాఫైర్ వర్క్స్, హుస్సేనియా కనకదుర్గా ఫైర్ వర్క్స్ గంటసేపు కాల్చిన బాణసంచా భక్తులను కనువిందు చేసింది. బ్యాటరీ బాక్సులు, ఔట్ల చెట్లు, రాకెట్‌లు, కలర్ జువ్వలు కాల్చారు.





శక్తి వేషాలు, నెమలి నృత్యాలు, కేరళ వాయిద్యాలు





ఆలయంలో భక్తులు

ఉపవాస దీక్షతో నిద్ర

గొల్లప్రోలు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో స్వయంభూ వల్లీ దేవసేనాసమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రా భిషేకాలు జరిగాయి. మల్లవరంలోని స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. సంతాన ప్రాప్తి కోసం వివిధ ప్రాంతాల నుంచి మహిళలు మంగళవారం సాయంత్రానికే చేరుకుని ఉపవాస దీక్ష చేశారు. ఉగ్రషష్ఠి మండపంలో నిద్రించారు.



మల్లవరంలో ఉపవాస దీక్షతో నిద్రించిన మహిళలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణం... కమనీయం

అన్నవరంలో సుబ్రహ్మణ్యేశ్వరుడి

వార్షిక దివ్యకల్యాణం

దర్శించి తరించిన భక్తజనం

అన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో వల్లీదేవసేన సమేతుడిగా పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యేశ్వరుడి వార్షిక దివ్యకల్యాణం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి,అమ్మవార్లను బాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయం నుంచి వార్షిక కల్యాణం జరిగే హైస్కూల్ ప్రాంగణం వద్దకు తోడ్కొనివచ్చి సర్వాంగ సుందరంగా వివిధ పుష్పమాలికలతో తీర్చిదిద్దిన ప్రత్యేకవేదికపై ఆశీనులు గావించారు. అర్చకస్వాములు గణపతిపూజ, పుణ్యాహవచనం, కన్యావరుణలు జరిపి అమ్మవారితో మంగళగౌరీపూజ నిర్వహించారు. అనంతరం వేదపండితులు ప్రవరను పఠించి సుబ్రహ్మణ్యేశ్వరుడికి ద్విజత్వాన్ని ప్రసాదించే యజ్ఞోపవీతాన్ని అలంకరింపచేశారు. పాదప్రక్షాళన గావించి మధుపర్కప్రాశన చేశారు. చతుర్వేదపండితులు దేశకాలమాన పరిస్థితులు వివరించే ప్రవరను పఠించారు. సుముహూర్త వేళ అమ్మవారి మెడలో స్వామి మూడుముళ్లు వేశారు. అనంతరం ఒకరి శిరస్సుపై మరొకరు ముత్యాల తలంబ్రాలు పోసుకుంటూ వేడుక నిర్వహించారు. పట్టుపీతంబరాలు, విశేష అభరణాలతో నుదుటతిలకం, బుగ్గనచుక్కతో స్వా మిఅమ్మవార్లు దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణతంతును చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాబి తదితరులు నిర్వహించారు. షష్ఠి పర్వదినం పురస్కరించుకుని స్వామి,అమ్మవార్లను భక్తులు దర్శించి తరించారు.



ఆలయానికి విద్యుత్ అలంకరణ



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

శభాష్.. స్వాతి

మాక్ అసెంబ్లీ స్పీకర్‌గా ఆదర్శ పాఠశాల విద్యార్థిని

శాసనసభను విజయవంతంగా నిర్వహించిన నెల్లిపూడి బాలిక

శంఖవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో శంఖవరం విద్యార్థిని అదరగొట్టింది. స్పీకర్‌గా శభాష్ అనిపించుకుంది. శాసనసభను విజయవంతంగా నిర్వహించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రుల సమక్షంలో సభను ఆమె నిర్వహిస్తుంటే ఇక్కడి ప్రజలు ఆన్‌లైన్‌లో వీక్షించి అబ్బురపడ్డారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం అమరావతిలో మంత్రి నారా లోకేశ్ ఆధ్వ ర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మాక్ అసెంబ్లీకి కాకినాడ జిల్లా శంఖవరం ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నెల్లిపూడి గ్రామానికి చెందిన సైపిరెడ్డి స్వాతి ఎంపికైంది. పిరికి లేకుండా, చొరవగా అవగాహనతో మాట్లాడే లక్షణాలు ఉండడంతో ఆమెను ఈ అవకాశం వరించింది. సభాపతిగా ఎంపికవ్వడం చాలా ఆనందంగా ఉందని.. జీవితంలో మర్చిపోలేని అవకాశమిచ్చిన ప్రభుత్వానికి, మంత్రి లోకేశ్‌కి కృతజ్ఞతలు తెలిపింది స్వాతి. ఆమెకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎంఈవో ఎస్వీ రమణ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.





స్పీకర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న స్వాతి

సామర్లకోట వీబీఆర్ఐ పూర్వవైభవానికి సన్నాహాలు

రాష్ట్ర వెటర్నరీ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రజనీకుమారి

సామర్లకోట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు పలు వ్యాధినిరోధక వ్యాక్సిలన్లు ఉత్పత్తి చేసే సామర్లకోట వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు (వీబీఆర్ఐ) పూర్వవైభవం తెచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని రాష్ట్ర వెటర్నరీ అడిషనల్ డైరెక్టర్(హెల్త్) డాక్టర్ రజనీకుమారి తెలిపారు. బుధవారం కాకినాడ జిల్లా సామర్లకోటలో వీబీఆర్ఐ వ్యాక్సీన్‌ల ఉత్పత్తి కేంద్రాన్ని ఆమె సందర్శించారు. పలు వ్యాక్సిన్ ఉత్పత్తి ల్యాబ్‌లు, భవనాలు, ల్యాబ్ పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వీబీఆర్ఐ జేడీ డాక్టర్ షనీలాకుమారి, అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ సూర్యకుమారి, డాక్టర్ శ్రీనివాసుతో సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 25 నుంచి మేకలలో మశూచి వ్యాధి నివారణకు వ్యాక్సీన్లను అందించే కార్యక్రమం ప్రారంభించామన్నారు. డిసెంబరు 15 వరకూ నిర్వహిస్తున్నందున ఆయా ప్రభుత్వ పశువైద్యశాలల ద్వారా వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం సామర్లకోట ఏరియా పశువైద్యశాలలో ఏడీ డాక్టర్ ఈ ప్రమీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొని పలు పథకాలను పశుపెంపకందారులకు వివరించారు. రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని రజనీకుమారి వీబీఆర్ఐ డాక్టర్లతో కలిసి నిర్వహించి అంబేడ్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.



సామర్లకోటలో సమీక్షిస్తున్న రజనీకుమారి

పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

అంబాజీపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు జడ్జి వై.బైన్నయ్యనాయుడు తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలంలో 25 ఏళ్ల మానసిక దివ్యాంగురాలు రాత్రి సమయంలో స్థానికంగా ఉన్న కట్టా బ్రహ్మేశ్వరరావు ఇంటికి వెళ్లి ఆహార పదార్థాలు తీసుకుని తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో జనసంచారం లేని ప్రదేశంలో 55 ఏళ్ల కట్టా పాటియ్య బాధితురాలిని దారిలో అడ్డగించి ఎత్తుకుని కొబ్బరితోటల్లోకి బలవంతంగా లాక్కుని వెళ్లిపోయాడు. బలవంతంగా ఆమెను అనుభవించిన్నట్లు ఈ విషయాన్ని చెబితే చంపేస్తానని బెదిరించినట్లు బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2024లో ఎస్ఐ కె.చిరంజీవి కేసు నమోదు చేయగా అప్పటి సీఐ డి.ప్రశాంత్‌కుమార్ దర్యాప్తు నిర్వహించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. అనంతరం పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో సమగ్ర దర్యాప్తు చేపట్టిన కోర్టులో ఛార్జీషీట్‌ను దాఖలు చేశారు. ఇటీవల జరిగిన ట్రైల్ నందు 8వ అదనపుజిల్లా కోర్టు పీపీ డి.రాధా కృష్ణరాజు ప్రాసిక్యూషన్ తరుపున బలమైన వాదన వినిపించగా జిల్లా జడ్జి బైన్నయ్యనాయుడు మానసిక దివ్యాంగు రాలిపై అత్యాచారం చేసిన నిందితుడికి 10సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు. బాధితురాలికి పరిహారాన్ని నిర్ణయించి చెల్లించాల్సిందిగా రాజమహేంద్రవరం జిల్లా న్యాయసేవల ఆథారిటీకి సిఫార్స్ చేశారు.

తైక్వాండో పోటీలలో ఉమ్మడి జిల్లాకు ఐదు పతకాలు



జాతీయస్థాయిలో మెడల్స్ సాధించిన క్రీడాకారులు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 26(ఆంధ్రజ్యోతి):ఈనెల 23నుంచి 25వ తేదీల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బరేలీలో జరిగిన 41వ సీనియర్ జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాకు చెందిన క్రీడాకారులు ఐదు పతకాలు (4 బ్రాంజ్, 1సిల్వర్) సాధించారని ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా టైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి బి.అర్జునరావు తెలిపారు. పి.హరికిరణ్ సిల్వర్ మెడల్ సాధించగా, వై.గంగాభవాని, జి.వంశీ, ఎల్.వెంకన్నదొర, ఎం.హర్షవర్ధన్‌లు బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. ఈ టోర్నమెంట్‌కి పి.భార్గవి కోచ్‌గాను, ఆర్.మణికంఠ మేనేజర్‌గాను వ్యవహరించారు. సీనియర్ ఏపీ టీం జాతీయస్థాయిలో రెండో స్థానా న్ని పొందారు. జాతీయస్థాయిలో మెడల్స్ సా ధించిన వారిని డీఎస్‌డీవో సతీష్ కుమార్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.వీరభద్రారెడ్డి, టైక్వాండో జిల్లా అధ్యక్షులు జి.ఎలీషాబాబు, ఏ మధుసూదన్‌రావు, కోచ్‌లు వీఎస్ సత్యనారాయణ, ఎస్ తులసి, కేవీ సత్యనారాయణ, ఎంపీ త్రిమూర్తులు, ఎస్.రత్న, తదితరులు అభినందించారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాలపై బిడ్డర్‌లకు నేడు అవగాహన సదస్సు

రాజమహేంద్రవరంఅర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ బస్‌స్టేషన్ల పరిధిలోని 13 ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చేందుకు ఈనెల 27వ తేదీన రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఆవరణలోని రీజనల్ ట్రైనింగ్ కళాశాలలో ఔత్సాహిక బిడ్డర్‌లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనపర్తి, కొవ్వూరు, రాజమహేంద్రవరం, కాకినాడ, పెద్దాపురం, తుని, మండపేట ప్రాంతాల్లో ఈ ఖాళీ స్థలాలు ఉన్నాయని, 15 ఏళ్లపాటు లీజుకు ఇవ్వడం కోసం సదస్సు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి కంటి పొర శస్త్రచికిత్స శిబిరం

సామర్లకోట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయం ఆవరణలో శంకర నేత్రాలయ(చెన్నై) వైద్యశాల, ఎర్నేని కుటుంబం, నటరాజనాట్య మండలి(అమెరికా) సంయుక్త నిర్వహణలో గురువారం ఉచిత కంటిపొర శస్త్రచికత్స శిబిరం ప్రారంభించనున్నట్లు ఆలయ ధర్మకర్తమండలి చైర్మన్ కంటే జగదీస్‌మోహన్, ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠంలు చెప్పారు. వారం రోజులపాటు నిర్వహించనున్న వైద్యశిబిరంలో చెన్నై శంకర నేత్రాలయం నుంచి ఒక ప్రత్యేక వాహనం రానుందని సుమారు 25 మంది కంటి వైద్యనిపుణులు పాల్గొంటారన్నారు.

కల్యాణ మండపంలో అగ్నిప్రమాదం

● ఏసీ నుంచి మంటలు ● కమ్మేసిన భారీగా పొగ



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది, కాలిపోయిన ఏసీ

తుని రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):తుని పట్టణంలో బెల్లపువీధి ఆర్యవైశ్య కల్యాణ మండలంలో స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పెళ్లి బృందం పెళ్లి వేడుకలో నిమగ్నమవ్వగా ఒక్కసారిగా మండపంలో నల్లటి పొగ కమ్మేసింది. ఏం జరిగిందో తెలియని ఆందోళనకర వాతావరణంలో పెళ్లి వారంతా అక్కడి నుంచి పరుగులు తీశారు. కొద్దిసేపటికి చూడగా వసతి గదుల ఫ్లోర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో ఏసీ కాలిపోతున్నట్లు గమనించిన కల్యాణ మండల ని ర్వాహకులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రా ణనష్టం జరగకపోవడంతో నిర్వాహకులతో పాటు, పెళ్లిబృందం ఊపిరి పీల్చుకున్నారు.

హాకీలో పీఆర్ విద్యార్థుల ప్రతిభ

● జాతీయస్థాయి పోటీలకు ముగ్గురు బాలికలు, ఇద్దరు బాలురు ఎంపిక

● అభినందించిన డీఐఈవో శారద, ప్రిన్సిపాల్ రాంబాబు



హాకీలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందిస్తున్న డీఐఈవో శారద, ప్రిన్సిపాల్ జ్యోతుల రాంబాబు

కాకినాడరూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రెండు రోజులపాటూ డీఎస్ఏలో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రస్థాయి బాల,బాలికల హాకీ టోర్నమెంట్‌లో కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళా శాల విద్యార్థులు ప్రతిభ కనబరచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతుల రాంబాబు తెలిపారు. ఈపోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల హాకీ జట్టు ప్రథమ స్థానాన్ని సాధించగా ఆజ ట్టులో తమ కళాశాల బాలికలు ఆరుగురు ఉండగా వారిలో సాయిధన రాజేశ్వరి, యోగామృత, అంబికా జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అదేవిధంగా బాలుర జట్టు ద్వితీయస్థానాన్ని సాధించగా వారిలో కార్తికే ఉదయ్‌రాజు, విజయ్ ధనుష్‌లు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారిణి ఐ.శారద, ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు అభినందించారు.

భావనారాయణస్వామి భూములపై ఉమ్మడి సర్వే ప్రారంభం

సర్పవరంజంక్షన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోనే పురాతన పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన కాకినాడజిల్లా కాకినాడరూరల్ సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణ స్వామి ఆలయానికి చెందిన భూముల సంరక్షణ కోసం దేవదాయ,ధర్మాదాయ, రెవెన్యూ శ్రీకారం చుట్టారు. బుధవారం సర్పవరంలో భావనారాయణస్వామికి చెందిన పలు ఆర్ఎస్ నెంబర్ 6/3లో 2.57 ఎకరాల భూమి, సర్వే నెంబర్ 6/4లో 3.93 ఎకరాల భూమిలో దేవదాయ,ధర్మాదాయశాఖ జిల్లా అధికారి కె.నాగేశ్వరరావు, ఈవో రేపాక శ్రీని వాసరావు, రెవెన్యూ సర్వేయర్ ఎం.సతీష్‌ల ఆధ్వర్యంలో ఉమ్మడి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవస్థానం భూముల సంరక్షణ కోసం జాయింట్ సర్వే చేపట్టామన్నారు. దేవస్థానం భూములు ఆక్రమణదారుల పరం కాకుండా ఉండేందుకు వీలుగా సర్వే చేపట్టామన్నారు. ఎక్కడైనా అన్యాక్రాంతమైన భూములు ఉంటే వాటిని గుర్తించి, సర్వే చేపట్టి భూములను తిరిగి స్వాధీనానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. భావనారాయణస్వామికి చెందిన భూములపై సమగ్ర సర్వే నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ గుమస్తా బోనం కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



సర్పవరంలో సర్వే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న దేవదాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు

లారీ ఢీకొని వ్యాన్ బోల్తా

● తప్పిన ప్రమాదం

గండేపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న వ్యాన్ గండేపల్లి వచ్చేసరికి వెనుక వస్తున్న లారీ ఢీకొంది. వ్యాన్ బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కా కపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. త్రుటిలో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.



జాతీయరహదారిపై బోల్తాకొట్టిన వ్యాన్

నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయండి

రాజమహేంద్రవరంలో కేంద్ర కార్మిక సంఘాల నిరసన ర్యాలీ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసే వరకూ పోరాటం ఆగదని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు పలువురు పేర్కొన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలో కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా శ్యామలాసెంటర్ నుంచి కోటిపల్లి బస్టాండు మీదుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ మాట్లాడుతూ ఏ రంగంలో పని చేసే కార్మికునికైనా ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26,000లు చెల్లించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పనిగంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, రాష్ట్ర కోశాధికారి బీవీవీ కొండలరావు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధరరావు తదితరులు మాట్లాడారు. ఈఆతఈ ఈ కార్యక్రమంలో ఆయా కార్మిక సంఘాల నాయకులు బి.పవన్, కొండలరావు, పి.లావణ్య, సప్పా రమణ, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని కోరుతూ నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి


దివాన్‌చెరువులో ఉన్న సర్పస్వరూప సుబ్రహ్మణ్యస్వామి


రాజానగరంలో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల

శోభాయమానంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం

● వైభవంగా షష్ఠి మహోత్సవాలు ●స్వామి సన్నిధిలో శయనించిన మహిళలు
● బారులుతీరిన భక్తులు ● ప్రత్యేక పూజలు, అభిషేకాలు

రాజానగరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సంతాన సిద్ధి ప్రదాతగా, కోరినకోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తుల పూజలందుకుంటున్న రాజానగరంలోని శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 99వ షష్ఠి మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సుబ్రహ్మణ్యేరుడిని దర్శించుకునేందుకు వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు. ఐదు రోజులపాటు జరిగే ఈఉత్సవాల్లో తొలిరోజు స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాతో పాటుగా పలువురు ప్రముఖులు సంతాన సుబ్రహ్మణ్యేశ్వరుడిని దర్శించుకున్నారు.

కన్నుల పండువగా సుబ్బారాయుడి కల్యాణం

దివాన్‌చెరువు(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు దివాన్‌చెరువు, శ్రీకృష్ణపట్నం, సంపత్‌నగరం, పాతతుంగపాడు, లాలాచెరువు హౌసింగ్‌బోర్డుకాలనీలలో బుధవార ం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా శ్రీకృష్ణపట్నంగ్రామంలో ఉన్న శ్రీవల్లీ దేవసేనాసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవంను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వేకువజామున కన్నులపండువగా జరిగింది. అలాగే దివాన్‌చెరువులో శ్రీలక్ష్మీగణపతి ఆలయ సముదాయంలోని కాశీఅన్నపూర్ణ మాత దేవాలయ ప్రాంగణంలో మారేడుచెట్టుకింద ఉన్న శ్రీవల్లీదేవసేనా సమేతసర్పస్వరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. బుధవారం వేకువజామునుంచే భక్తులు దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేశారు. దివాన్‌చెరువులోని శ్రీవిశ్వేశ్వరీదేవి అమ్మవారి ఆలయప్రాంగణంలో ఉన్న బాలకుమారస్వామి వారికి గత ఆరురోజులుగా జరుగుతున్న షష్ఠిఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. స్వామివారికి అభిషేకాలుతోబాటు మూలమంత్రంతో హోమాన్ని ఆలయనిర్వాహకులు డాక్టరు రాంబాబు, సుబ్బలక్ష్మి దంపతులు నిర్వహించారు. హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, స్థానిక వల్లీదేవసేనా సమేత సర్పస్వరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కల్యాణోత్సవంను మంగళవారం రాత్రి జరిపించగా బుధవారం స్వామివారికి ప్రభాతసేవ విశేష అభిషేకాలు జరిగాయి.


అనపర్తిలో వీర్రాజుమామిడి వద్ద స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నల్లమిల్లి, బర్మాకాలనీలో గన్నికృష్ణకు స్వామివారి పటం అందిస్తున్న పెద్దలు

రాజమహేంద్రవరంకల్చరల్(ఆంధ్రజ్యోతి): స్థానిక కోరుకొండ రోడ్డులోని శ్రీవల్లి దేవసేన సమేత నాగబంధ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి మహోత్సవం జరిగింది. బుధవారం తెల్లవారుజామున రెండుగంటలకు స్వామివారికి మహారుద్రాభిషేకం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఇసుకపల్లి సుబ్రహ్మణ్యం ఆలయ అర్చకులు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఏపీ హౌసింగ్‌బోర్డు మాజీ చైర్మన్, మేడపాటి షర్మిలారెడ్డి, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, జనసేన కార్పొరేషన్ అధ్యక్షుడు వైశ్రీను, చలుమూరి శ్రీను స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయకమిటీ చైర్మన్ వైవీడీ ప్రసాద్, పాలకవర్గ సభ్యులు ఘనంగా స్వాగతించారు.

రాజమహేంద్రవరం సిటీ(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం లాలాచెరువు సమీపంలోని బర్మాకాలనీలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామిఅమ్మవార్లను బుధవారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ దర్శించుకుని పూజలు చేశారు. తొలుత గన్నికృష్ణను ఆలయ పెద్దలు స్వాగతించారు. అనంతరం హౌసింగ్‌బోర్డు కాలనీలో నందూరి సుబ్బారావు ఆహ్వానం మేరకు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి దర్శించుకున్నారు. టీడీపీ నాయకులు ఉప్పులూరి జానకిరామయ్య, మళ్ల వెంకట రాజు, కెవి శ్రీనివాస్, కాదా ఈశ్వరరావు ఉన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ఎమ్మెల్యే పూజలు

బిక్కవోలు(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి షష్ఠి సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా పందలపాక శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈయన వెంట షష్ఠి ఉత్సవ కమిటీ అధ్యక్షు డు పల్లి శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ తేతలి సుమ, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుగ సూర్యకుమారి, కూటమినేతలు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చాగంటి సాయిబాబారెడ్డి, బేరా వేణమ్మ, కర్రి సత్యగౌరి, రావాడ నాగు, ఇందల వీరబాబు, చింతా శ్రీనివాసరెడ్డి, రెడ్డి శ్రీను, పడాల చిన బుజ్జి, పడాల సూర్యనారాయణరెడ్డి, చిరంజీవి రాజు, సూర్యకుమారి పాల్గొన్నారు. బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి వారి షష్ఠి సందర్భంగా బుధవారం రాత్రి నిర్వహించిన స్వామి వారి గ్రామోత్సవం భక్తులకు కనువిందు చేసింది. గ్రామోత్సంలో ఏర్పాటు చేసిన బుట్టబొమ్మలు, బ్యాండు మేళాలు, చండీ వాయిద్యాలు, కోయడాన్సులు, గరగ, నెమలి నృత్యాలు, శక్తి వేషాలు, తీన్‌మార్‌లు అందర్నీ అలరించాయి.

వీర్రాజు మామిడి సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి వేడుకలు

అనపర్తి(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవం సందర్భంగా బుధవారం అనపర్తి మండలంలోని అనపర్తి, మహేంద్రవాడ, కుతుకులూరు గ్రామాల్లో పలుఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనపర్తిలోని వీర్రాజు మామిడి వద్ద ఉన్న కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచి రాత్రివరకు ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. స్వామివారిని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఎమ్మెల్యేను సత్కరించి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా నేత్ర వైద్యదంపతులు తేతలి వెంకట్రామిరెడ్డి సంధ్యారెడ్డి దంపతులు, డాక్టర్ తేతల అరుణ వీర్రెడ్డి దంపతులు, అధికారులు, పలువురు రాజకీయ, వ్యాపార ప్రముఖులు స్వామివారిని దర్శించుకు న్నారు. కెనాల్ రోడ్డు నుంచి భక్తులు ఆలయానికి చేరుకునే విధంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు పడవలపై ప్రయాణించి స్వామిని దర్శించుకున్నారు. ముందుగా స్వామివారి దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వోగిరెడ్డి సత్తిరెడ్డి మండ పోతారెడ్డి, కర్రి సుధాకరరెడ్డి, మండ రామారెడ్డి, తమలంపూడి వీర్రాఘవరెడ్డి, తేతలి వీర్రెడ్డి, వెలగల గంగిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోరుకొండ(ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం కోరుకొండ గ్రామంలో గల శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్ఠి మహోత్సవం సందర్భంగా స్వా మివారిని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దర్శించుకున్నారు. ఆయనతోపాటు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

ప్రగడ కోటయ్య వర్ధంతి

రాజమహేంద్రవరంకల్చరల్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): చేనేత పితామహుడుప్రగడ కోటయ్యను చేనేత సంఘీయులు ఆదర్శంగా తీసుకోవాలని వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు కెకె సంజీవరావు అన్నారు. బుధవారం రాజమండ్రి వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో స్థానిక తుమ్మలావ శ్రీ భావనాఋషి గుడి ఆవరణలో ఉన్న పద్మశాలీ సంక్షేమ సంఘ కార్యాలయంలో ప్రగడ కోటయ్య 30వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రగడ కోటయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ చిందం రాధాకిషన్, రాష్ట్ర అధికార ప్రతినిధి కెకెసంజీవరావు, సప్పా దుర్గాప్రసాద్,తంగెళ్ళ బాబి,బళ్ళా శ్రీనివాసరావు, మత్సేటి శివ ప్రసాద్,తీడ ఆదిబాబు,నీలం వీరవెంకట సత్యనారాయణ, బత్తుల నరసింహమూర్తి,బొజ్జ సన్యాసిరావు, జి.సురేష్,కురువెళ్ళ మోహ న మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఎస్ఐఆర్-2026పై అధికారులకు శిక్షణ

రాజమహేంద్రవరం, నవంబరు 26(ఆంధ్రజ్యో తి): జిల్లాలో ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ 2026)కు సంబంధించిన శిక్షణ బుధ వారం కలెక్టరేట్‌లో డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల డీటీలు, ఎస్ఏలు, ఎన్నికల నిర్వాహకులు పాల్గొ న్న ఈ శిక్షణలో బీఎల్వో యాప్‌లో ఎలక్టోరల్ మ్యాపింగ్, ఈఎఫ్ ఫారమ్ పంపిణీ, సేకరణ, 2002 ఎస్ఐఆర్ డేటాతో మ్యాచింగ్, లింకింగ్, ఫారం-6 సేకరణ, ఓటర్ల గుర్తింపు వంటి అంశా లపై భాస్కర్‌రెడ్డి వివరించారు. శిక్షణలో భాగంగా అధికారులు ప్రతిఓటరు ఇంటికి కనీసం మూడు సార్లు వెళ్లి ఈఎఫ్ ఫారమ్ సేకరించాలని బీ ఎల్వోలకు సూచించారు. పట్టణాల్లోని వలస కూ లీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. అనంతరం రాజకీయ పా ర్టీల ప్రతినిధులతో డీఆర్వో సీతారామ మూర్తి సమావేశమై మాట్లాడుతూ ఎస్ఐఆర్‌ని వివరిం చారు. ఓటర్ల జాబితా పురోగతి, ప్రతి ఓటరు వివరాలను కచ్చితంగా నమోదుచేసే విధంగా సహకరించాలని కోరారు.

దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కడియం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దళితుల మనోభావాలు కించపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీదర్శకుడు అన్నం దేవుల గీతాకృష్ణపై చర్యలు తీసుకోవాలని కడియం మండలం దళిత నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు లిఖితపూర్వకంగా వినతిపత్రాన్ని కడియం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ లక్ష్మిప్రసన్నకు అందజేశారు. దళితనాయకులు మాట్లాడుతూ సామాజిక మాధ్యమంలో భారత రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ, దళితులను కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. దళిత నాయకులు కాయల సత్యనారాయణ, దమ్ము కృష్ణంరాజు, ఎం.చినబాబు, జల్లి కృపారావు, కె.బుల్లియ్య, పి.సామ్యూల్, వి.శ్రీను, బి.జాన్ బాబు తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజమహేంద్రవరంరూరల్ నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని. ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని రాజమహేం ద్రవరం సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.సూర్యరమేష్ అన్నారు. రూరల్ మండలం బొమ్మూరులో బుధవారం నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకంలో భాగంగా ఏడాదిలో 14 వేలు రైతుల ఖాతాకు జమ అయిందన్నారు. రైతులు ధాన్యం అమ్మిన 24గంటలలోపు రైతు ఖాతాకు సొమ్ము లు జమ అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మత్యేటి ప్రసాద్, కామిని ప్రసాద్, బొప్పన శ్రీను, వ్యవసాయ విస్తరణాధికారులు వేణుమాధవ్, పీటర్ నైతుల పాల్గొన్నారు.

దొరగారితోటలో ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

కడియం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):కడియం మండలం మురమండ దొరగారితోటలో బుధవారం 15 అడుగుల ఎత్తు కలిగిన ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కాలనీకి చెందిన రాజాన మాలునాయుడుదేవి దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. నాగదేవర విశ్వనాధశర్మ వేదమంత్రాలు మధ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఎంఆర్‌పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి రూ. 50వేల విరాళాన్ని ఆలయకమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్తి భాస్కరరెడ్డి, ప్రత్తిపాటి రామారావుచౌదరి, వట్టికూటి దత్తుడు, రత్నం అయ్యప్ప, చెక్కపల్లి మురళి, ముద్రగడ జెమీ, దేవళ్ళ రామ్మోహనరావు, గన్ని రామారావు, ఈదర దయాళ్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజానగరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వార్షిక మరమ్మతుల కారణంగా 33/11కేవీ దివాన్‌చెరువు, మల్లంపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ల నుంచి సరఫరా అయ్యే అన్ని 11కేవీ ఫీడర్లకు ఈనెల 28న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ బుధవారం తెలిపారు.

ఈ ఔషధి పోర్టల్ సక్రమంగా నిర్వహించాలి

● జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ సర్క్యులర్

రాజమహేంద్రవరంఅర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌కు వస్తున్న రోగులకు ఉచితంగా అందజేసే మందుల నిర్వహణకు సంబంధించిన ఈ-ఔషధి పోర్టల్‌ను సంబంధిత ఉద్యోగులు సక్రమంగా నిర్వహించాలని రాజమహేంద్రవరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ ఆసుపత్రి చీఫ్ ఫార్మసీ అధికారిని ఆదేశించారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక సర్క్యులర్ జారీ చేశారు. సిబ్బందిలో ఎవరికైనా ఈ - ఔషధి వినియోగంపై అవగాహన లేకపోతే వారిని శిక్షణకు పంపిస్తామని, అలాంటి వారి జాబితా తనకు అందజేయాలని పేర్కొన్నారు. ఔషధ లెక్కల్లో కచ్చితత్వం తప్పనిసరి అని, దీనివల్ల ఏ రోగికి ఏ మందులు ఇస్తున్నారో స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. ఫార్మసీ మెయిన్ స్టోర్‌లో రిజిస్టర్ల నిర్వహణ క్రమబద్ధంగా జరగాలని ఆయన సూచించారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా మార్గాని ప్రమాణస్వీకారం


మార్గానిని సత్కరిస్తున్న నేతలు

కడియం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కడియపులంక వీరహనుమాన్ నర్సరీ అధినేత, టీడీపీ రాష్ట్రనాయకులు మార్గాని సత్యనారాయణ బుధవారం మంగళగిరిలో ఏపీఐఐసీ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, రెవెన్యూశాఖ మంత్రి సత్యప్రసాద్, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆర్టీసీ చైర్మన్ కొనగళ్ళ నారాయణరావు, కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయశ్రీనివాస్, జైళ్లశాఖ సలహామండలి సభ్యులు బాలునాయుడు తదితరులు మార్గానికిఅభినందనలు తెలిపారు.

మార్గానికి కీలకబాధ్యతలు

● చైర్మన్ మంతెన రామరాజు

మార్గానికి కీలకబాధ్యతలు అప్పగిస్తామని ఆ సంస్థ చైర్మన్ మంతెన రామరాజు వెల్లడించారు. ఈసందర్భంగా రామరాజు మాట్లాడుతూ నర్సరీ రైతు మార్గాని సత్యనారాయణ తమ సంస్థలో డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకోవడం అభినందనీయం అన్నారు. పరిశ్రమల స్థాపనకు తాము ఏర్పాటుచేసే లేఅవుట్‌ల అభివృద్ధిలో పచ్చదనం, సుందరీకరణ ఎంతో ప్రాముఖ్యమైందని, వాటి బాధ్యత మార్గానికే అప్పగిస్తామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ మార్ని వాసు, వైస్‌చైర్మన్ బోడపాటి గోపి, దుళ్ళ కడియపుసావరం గ్రామటీడీపీ అధ్యక్షుడు గుర్రపు సత్యనారాయణ, వరగోగుల వెంకటేశ్వరరావు, జేగురుపాడు ఉపసర్పంచ్ పాతూరి రాజేష్, రాష్ట్ర ఎస్సీసెల్ నాయకులు జల్లి కృపారావు, బీసీసెల్ నాయకులు వాసంశెట్టి బాలాజీతోపాటు కోమలి రామకృష్ణ, వడ్లమూడి రాజేష్ మార్గానిని భారీ గజమాలలతో సత్కరించారు.

డాక్టర్ గన్ని భాస్కరరావుకు జీవన సాఫల్య పురస్కారం



కజకిస్తాన్‌లో అవార్డు అందుకుంటున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీఎస్ఎల్ వైద్యా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు జీవన సాఫల్య పుర స్కారం అందుకున్నారు. కజకిస్తాన్ లోని అల్మాటీ నగరంలో నవభారత్ ఇంటర్నేషనల్ బిజినెస్ ఎక్సలెన్స్ సమ్మిట్-2025 ఈమేరకు డాక్టర్ గన్ని ఈ అవార్డును అందుకున్నారు. సమ ర్థవంతమైన నాయకత్వాన్ని గౌరవించే ఈవే దికపై భారతీయ వైద్య రంగ ప్రముఖులు, జీఎస్ఎల్ విద్యాసంస్థలు, ఆసుపత్రుల వ్యవ స్థాపకుడు డాక్టర్ గన్ని భాస్కరరావును ఆల్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో ఘనంగా సత్కరించారు. భారతదేశంలో వైద్య విద్యను అంతర్జాతీయ స్థాయికి చేర్చడంలోనూ, దశాబ్దాలుగా డాక్టర్ గన్ని అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా ఈపురస్కారం వరించింది. మహారాష్ట్ర సీఎం సతీమణి అమృతా ఫడ్నవీస్, కజకిస్తాన్ దౌత్య వేత్త ఎస్.బులాట్, నవభారత్ గ్రూప్ డైరెక్టర్ వైభవ్ మహేశ్వరి చేతులమీదుగా డాక్టర్ భాస్కరరావు ఈ అవా ర్డును అందుకున్నారు. సిమ్యులేషన్ ఆధారిత వైద్యశిక్షణలో అత్యుత్తమ వైద్యసేవల విభాగం గా డాక్టర్ భాస్కరరావు తనయుడు డాక్టర్ గన్ని సందీప్ అవార్డు అందుకున్నారు.



డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో కృష్ణ నాయక్, ఆర్ట్స్ కళాశాలలో నివాళులర్పిస్తున్న దృశ్యం




డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ ప్రవేశికను చదివిస్తున్న డిప్యూటీ కమిషనర్, అధికారులు, ర్యాలీలో పాల్గొన్న మహిళలు

రాజ్యాంగం ఒక ఆధ్యాత్మిక శక్తి

● రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్ ● ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు


రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ తదితరులు, కోరుకొండ బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కంబాల శ్రీనివాసరావు

రాజమహేంద్రవరంఅర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కేవలం ఒక నియమ పుస్తకం మాత్రమే కాదు. మన దేశ పరిపాలన, సమాజప్రగతి, పౌరుల జీవన విధానాలను సమగ్రంగా నిర్మించే ఆధ్యాత్మికశక్తి అని రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్ అన్నారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను రాజమహేంద్రవరంలో ఘనంగా నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆర్డీవో కృష్ణనాయక్ మాట్లాడుతూ స్వతంత్ర భారత నిర్మాణానికి పునాదివేసిన అసాధారణ గ్రంథం రాజ్యాంగం అని పేర్కొన్నారు. కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొని రాజ్యాంగ ప్రస్తావికను సామూహికంగా పఠించారు.

● రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘం ప్రెసిడెంట్ ముళ్ల మాధవరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డీవీఎస్ఎస్ మూర్తి, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ జి.చంద్రశేకర్ మాట్లాడారు. సంఘం ప్రధాన కార్యదర్శి గద్దే సుధాకర్, కోశాధికారి ఎస్.విజయలక్ష్మి, సభ్యులు వరప్రసాద్, విష్ణు వందన, తెలుగు అధ్యాపకురాలు సౌందర్య, విద్యార్థులు పాల్గొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం మాట్లాడారు. సెకండ్ బీఏ విద్యార్థి కె.శివకుమార్ ప్రసంగం ఆకట్టుకుంది. రాజనీతిశాస్త్ర విభాగాధిపతి జి.హరికృష్ణ, ఏ.నూకరాజు, శరత్‌బాబు, వై.స్వర్ణశ్రీ, సంజీవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

● రాజమహేంద్రి మహిళా విద్యాసంస్థల్లో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ తేతలి సత్యసౌందర్య మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని నిలబడ్డామంటే అందుకు భారత రాజ్యాంగమే కారణం అని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఎంకేఎస్ ప్రసాద్ మాట్లాడారు. కళాశాల అధ్యాపకులు సుజాత, శిరీష, ఉమామహేశ్వరి, కుమారి, ప్రేమజ్యోతి, కరుణ, విజయ, మీనాక్షి, యశోద, సిరిమల్లి, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవో వీరవెంకట్రావు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చేకుట్రలను తిప్పికొడతాం

భారత రాజ్యాంగం పూర్తిస్థాయిలో అమలు కావాలంటే ఒక్క బీఎస్పీ ద్వారానే సాధ్యమని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, రాజమహేంద్రవరం నగర ఇన్‌చార్జి ఇసుకపట్ల రాంబాబు అన్నారు. రాజమహేంద్రవరం కోర్లంపేటలోని బీఎస్పీ అర్బన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ జిల్లా కన్వీనర్ నక్కా వెంకటరత్న రాజు, కొల్లాటి అబ్బులు, ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను కాపాడాలి

● నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగవిలువలు కాపాడాల్సిన బాధ్యత యువతపై ఉందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ భారతదేశం సుభిక్షం, సురక్షితం గల దేశమని ప్రపంచ దేశాలలో లేని గొప్పవాతావరణం మనదేశంలో ఉందన్నారు. విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ కామర్స్ విద్యార్థులు తెలుగు,ఇంగ్లీషు భాషలలో ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, విశ్వవిద్యాలయం అధికార్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం మార్గదర్శకం

● నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ

రాజమహేంద్రవరం సిటీ(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ ప్రతిఒక్కరికి మార్గదర్శకమని రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఉద్యోగులతో భారత రా జ్యాంగ ప్రవేశికను చదివించారు. డిప్యూటీ డైరెక్టర్ (అమృత్) రామారావు మాట్లాడుతూ ప్రపంచం లోనే భారత రాజ్యాంగం అత్యున్నతమైనది అన్నారు. కార్పొరేషన్ సెక్రటరీ శైలజా వల్లి, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఇన్‌చార్జి ఎస్ఈ రీటా, మేనేజరు ఎండీ అబ్దుల్‌మాలిక్, రెవెన్యూ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, రవికుమార్, అకౌంటెంట్ నాగమణి అధికారులు పాల్గొన్నారు.

● భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరంలో అంబేడ్కర్ సేవాకేంద్రం (ఆస్క్) ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని లాలాచెరువు అంబేడ్కర్ విగ్రహం వద్ద రిటైర్డ్ ఆర్డీవో జితేంద్ర జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆస్క్ వ్యవస్థాపకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగానికి అనుగుణంగా పాలన సాగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రిటైర్డ్ ఆర్డీవో జితేంద్ర మాట్లాడుతూ రెండు సంవత్సరాల 11 నెలలపాటు రాజ్యాంగాన్ని తయారుచేయడానికి నియమించిన డ్రాఫ్టింగ్ కమిటీ అన్ని ఆర్టికల్స్ నివేదికలు రూపొందించారని, దాన్ని 1949 నవంబరు 26న అప్పగించగా 1950 నవంబరు 26 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి రాంబాబు, జితేంద్ర, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, ఖండవల్లి లక్ష్మిలు నివాళు అర్పించారు. ఈ ర్యాలీలో ఉప్పు సత్తిబాబు, పెదమల్లు రమేష్, ఎ.రవికుమార్, జి.సుధాకర్, మెంటేప్రసాద్, పి.దయామణి, దీపు, లోకేష్, మహిళలు పాల్గొన్నారు.

రాజానగరం(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)లో, గైట్ డిగ్రీ కళాశాలల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రోవైస్ ఛాన్సలర్ కేవీబీ రాజు మాట్లాడుతూ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈకార్యక్రమంలో జీజీయూ రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, సతీష్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటేశ్వర్లు, వివిధ విభాగాల అధిపతులు మాధవి కామేశ్వరి, సత్యశ్రీహరి, రాజు పాల్గొన్నారు.

కడియం(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్టిలంకలో అంబే ద్కర్ యూత్, జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం రాజ్యాం గ దినోత్సవం ఘనంగా జరిగింది. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బహుజన సమాజ్ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ నక్కా వెంకటరత్నంరాజు మాట్లాడారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేతృత్వంలో రాజ్యాంగ రచన జరిగిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అనపర్తి మండలం రామవరంలో ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరి డా గంగాభవాని, కూటమి నాయకులు చింతా సురేష్‌రెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, కర్రి చిన్నారెడ్డి తదితరులు పా ల్గొన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ ఎమ్ పులగం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకుబహుమతులు అందజేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ మల్లిడి పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కలిదిండి గోవిందు, కొత్తపల్లి శ్రీరాములు, న్యాయవాది బడుగు సత్తిబాబు, నక్కా చంటిబాబు, కప్పల బాస్కరావు, నెల్లి అన్నవరం, కొల్లపు వీరన్న పాల్గొన్నారు.

బిక్కవోలు(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుక లు ఘనంగా నిర్వహించారు. బిక్కవోలు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సత్యకృష్ణ, పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

కోరుకొండ(ఆంధ్రజ్యోతి): కోరుకొండ బస్టాండ్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో రామసే న సభ్యులు, బీజేపీ నాయకులు, గ్రా మస్తులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు..

పవన్..అభివాదం



బహిరంగ సభలో పవన్ అభివాదం..పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్

నెలాఖరు వరకు స్మార్ట్ రేషన్ కార్డులు

రాజమహేంద్రవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రేషన్ కార్డుదారులు ఈ నెలాఖరులోగా తమ స్మార్ట్ రేషన్ కార్డులను తప్పనిసరిగా తీసుకోవాలని జేసీ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. పాత రేషన్ కార్డుల స్థానంలో 5,59,348 స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం జిల్లాకు పంపిందన్నారు. కొందరు ఇతర ప్రాంతాలకు ఉపాధి నిమిత్తం వెళ్లడం, తమ కార్డులు ఏ సచివాలయంలో ఉన్నాయో తెలియకపోవడం వంటి కారణాలతో 29,107 కార్డులు ఇప్పటికీ పంపిణీ కాలేదని చెప్పారు. కార్డు పొందని వాళ్లు సమీప సచివాలయానికి వెళ్లి కుటుంబీకుల్లో ఒకరిది వేలిముద్ర లేదా ఓటీపీ ధ్రువీకరణ ద్వారా స్మార్ట్ కార్డు పొందాలన్నారు. జిల్లాలోని రేషన్ కార్డుల్లో 15,85,090 మంది సభ్యులు ఉండగా వారిలో 57,022 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. దగ్గరలోని రేషన్ షాపులో ఈ పోస్ యంత్రం ద్వారా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు.

రేపు జాబ్ మేళా

రాజమహేంద్రవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని మోడల్ కేరీర్ సెంటర్ ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి కె.హరిశ్చంద్ర ప్రసాద్ బుధవారం తెలిపారు. సెరా కేర్ హ్యాపీలైఫ్, గూగుల్ పే సంస్థల్లోని ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ విద్యార్హతలు, 19-35 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు హాజరు కావొచ్చన్నారు. https://tinyurl.com/jf1may25 లింక్ ద్వారా రిజిస్టరు చేసుకోవాలన్నారు. వివరాలకు 95332 21189 నెంబరులో సంప్రదించాలన్నారు.



డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగులపై పెరుగుతున్న పని ఒత్తిడి తగ్గించాలని ఏపీజీఈఏ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులపై పెరుగుతున్న పని ఒత్తిడి అంశంపై నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ మాట్లాడారు. వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో సర్వేలు చేయలేదని.. జిల్లాలోని 40 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం అన్యాయమన్నారు. పనిభారం తగ్గించాలని కోరారు. డీఆర్‌వో సీతారామమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సూర్య, మహిళా విభాగం కో కన్వీనర్ సీత, నగర నాయకులు పాల్గొన్నారు.

30 వరకు సర్వే : పీడీ

దివాన్‌చెరువు, నవంబరు26 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో గృహాల మంజూరుకు జరుగుతున్న సర్వేను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ నాతి బుజ్జి తెలిపారు. దివాన్‌చెరువులో జరుగుతున్న పీఎంఏవై2.0 (గ్రామీణ్) సర్వేను బుధవారం ఆకస్మికంగా పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 30వ తేదీలోగా సర్వే పూర్తిచేయాలన్నారు. అర్హులైన పేదలను మాత్రమే ఎంపిక చేయాలని సిబ్బందికి సూచించారు. ఎక్కడా అవకతవకలకు తావుండకూడదన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ సంస్థ మండల వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మీ కోసమే వచ్చామయ్యా: రాజోలు నియోజకవర్గం శివకోడులో బహిరంగ సభకు హాజరైన ప్రజానీకం



జన..పవనాలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

పవన్ వచ్చారు.. హామీలిచ్చారు.. మీకు అండగా నేనున్నా.. మీ సమస్యలన్నీ పరిష్కరిస్తానంటూ భరోసానిచ్చారు.. ఏపీ డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారిగా రాజోలు నియోజకవర్గంలో పర్యటించిన పవన్‌కల్యాణ్‌కు జనం అడుగడుగునా నీరాజనం పలికారు. మలికిపురం మండలం గూడపల్లిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు బుధవారం ఉదయం 10.30 గంటలకు చేరుకున్న ఆయన తిరిగి శివకోడులో బహిరంగ ముగించుకుని నాలుగు గంటల అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు హెలికాఫ్టర్‌లో అమరావతి పయనమై వెళ్లారు. గూడపల్లిలో హెలికాఫ్టర్ దిగిన తరువాత కేశనపల్లి వంతెన పై నుంచి ఉప్పునీటితో చనిపోయిన కొబ్బరిచెట్లను పరిశీలించి గంటన్నర సేపు రైతులతో ముఖాముఖిగా ముచ్చటించారు. శంకరగుప్తం డ్రెయిన్ మూలాలను అడిగి తెలుసుకుని 45 రోజుల వ్యవధిలో ప్రణాళికలు రూపొందించి కొబ్బరి రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని స్పష్టత ఇచ్చారు. అనంతరం అక్కడి నుంచి రాజోలు మండలం శివకోడుకు వచ్చే ప్రాంతంలో ఎన్నో సమస్యలు గుర్తించారు. కూనవరంలో శిథిల శివాలయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ప్రకటించారు. పల్లెపండుగ 2.0 ప్రారంభంతో పాటు కోనసీమలో రహదారుల అభివృద్ధికి అదనంగా రూ.100 కోట్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే వాడపల్లి ఆలయానికి వెళ్లే ఏటిగట్టు రోడ్డు అభివృద్ధికి రూ.6 కోట్లు విడుదల చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఓఎన్జీసీ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా..కోనసీమలో రైల్వేలైన్ ఏర్పాటు ఆవశ్యకతను ప్రస్తావించారు. శివకోడుసభలో 1:15 గంటల పాటు పవన్ ప్రసంగం ఆకట్టుకుంది. పవన్ ప్రసంగం సమయంలో అభిమానులు కేరింతలు, హర్షధ్వానాలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది.

కొబ్బరి రైతుల బాధ్యత నాది..

కొబ్బరి రైతులెవరూ రోడ్డెక్కకుండా కాపాడే బాధ్యత నాది అంటూ భరోసా ఇచ్చారు. కేరళ తరహా ప్రకృతి అందాలతో అలరారే కోనసీమలో బ్యాక్ వాటర్ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. సినిమా షూటింగ్‌లకు అనువైన పరిస్థితులున్నాయి.కొబ్బరి రైతులకు కోకోనట్ బోర్డు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు.



అడుగడుగునా నీరాజనం

- 4 గంటల పాటు పర్యటన
- అభిమానుల ఎదురుచూపులు
- సమస్యల పరిష్కారానికి చర్యలు
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

నాటి చిరు దీపమే.. నేడు కీలకం..

2019 ఎన్నికల్లో నేను ఓడిపోయాను. రాజోలు నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిని గెలిపించి చీకట్లో ఒక చిరుదీపాన్ని వెలిగించారు. కానీ ఆ ఎమ్మెల్యే వేరే పంచకు చేరారు. ఆనాటి చిరు దీపమే ఈ రోజు కూటమి ప్రభుత్వం ఏర్పాటులో కీలకమైందని పవన్ ప్రస్తావించారు.







నిధులు..వరదలా..

రాష్ట్రంలో రూ.6,787 కోట్ల అంచనాతో పల్లెపండుగ కార్యక్రమం చేపడుతున్నాం. రూ.5,838 కోట్ల అంచనాతో 8,571 కిలోమీటర్ల రోడ్లు నిర్మిస్తున్నాం. రూ.4 కోట్లతో 58 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. పంచాయతీల పరిధిలో రూ.406 కోట్లతో 15 వేల కొత్త అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. రూ.148 కోట్లతో డీపీఆర్సీ, పంచాయతీ భవనాలు నిర్మిస్తాం'. కోనసీమకు అదనంగా రూ.100 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నాం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డ్రెయిన్లు, పంట కాల్వల ఆధునికీకరణకు రూ.4 వేల కోట్లు అవసరం.





యువతుల కేరింత.. తుళ్లింత



శివకోడు సభలో ప్రసంగిస్తున్న పవన్ చిత్రంలో ఎంపీ హరీష్, ఎమ్మెల్యేలు బొమ్మిడి నాయకర్, దేవవర ప్రసాద్, అయితాబత్తుల, గిడ్డి సత్యనారాయణ



మేం జన సైనికులం : జనసేన ఎంబ్లమ్‌తో మహిళల ఉత్సాహం

ప్లకార్డులతో కూటమి ద్వయం

నీటి పారుదల వ్యవస్థ ఆధునీకరణకు చర్యలు

జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో ఎంపీ

రాజమహేంద్రవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల వ్యవస్థ ఆధునికీకరణ.. పశ్చిమ, తూర్పు డెల్టా కాలువల్లో మరమ్మతులపై సమగ్ర దృష్టి సారించాలని.. ఏజెన్సీలకు అప్పగించకుండా అధికారులే స్వయంగా డీపీఆర్ సిద్ధం చేయాలని ఎంపీ పురందేశ్వరి ఆదేశించారు. జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో బుధవారం ఆమె మాట్లాడారు. గోదావరి డెల్టాలోని మొత్తం 8,96,507 ఎకరాలకు అవసరమయ్యే 93.26 టీఎంసీల నీటి లభ్యత, సీలేరు, పోలవరంలో నిల్వలు, డిసెంబరు-మార్చి కాలంలో అంచనా ఇన్‌ఫ్లోస్ వంటి అంశాలపై సమీక్షించామన్నారు. ఓ అండ్ఎం, ఆర్ఆర్ఆర్, ఆధునికీకరణ పనులు అంతర్‌జిల్లా అధికారుల సమన్వయంతో జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్ ఇంజనీర్లు కలిసి సమీక్షలు నిర్వహిస్తేనే గోదావరి డెల్టాలోని సంక్లిష్ట నీటి పారుదల వ్యవస్థ స్థిరత్వం సాధ్యమవుతుందన్నారు.కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ రబీ సీజన్ పంటసాగు సమయానికి అవసరమైన నీటి పంపిణీ, కాలువల సంరక్షణ, ఇంజినీరింగ్ పనులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను శనివారానికి సమర్పించాలని ఆదేశించారు. జేసీ మేఘ స్వరూప్ ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే, ఇంజినీరింగ్ సిబ్బందిని సమన్వయం చేసి 60 రోజుల్లో సమగ్ర డీపీఆర్ సిద్ధం చేయాలని సూచించారు. షట్టర్ల మరమ్మతులు, బండ్‌ల పటిష్టత, కాటన్ మ్యూజియం నిర్వహణ వంటి అంశాల్లో దీర్ఘకాలిక పరిష్కారాలకు ప్రత్యేక నివేదికలు సిద్ధం చేయాలన్నారు. షట్టర్ల మరమ్మతుల పనులు పూర్తి నాణ్యతతో చేయాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు సూచించారు. బురద కాలువ సమస్యల వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రస్తావించారు. తొర్రిగెడ్డ, చాగల్నాడు, పుష్కర ప్రాజెక్టులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గోదావరి ఘాట్లు, ధవళేశ్వరం బ్యారేజ్‌లోని 175కి 115 గేట్లకు అనివార్యంగా మరమ్మతులు అవసరమన్నారు. ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్ గోదావరి డెల్టా సిస్టంకు సంబంధించిన ఆయకట్టు, నీటి అవసరత, టీఎంసీ లభ్యత, సీలేరు-పోలవరం లింక్‌ల వివరాలను సమగ్రంగా వివరించారు. తూర్పు, పశ్చిమ డెల్టాలు, తొర్రిగెడ్డ పంపింగ్ వ్యవస్థ, కొవ్వాడ కాలువల పరిధిలోని 73,236 ఎకరాలకు 7.324 టీఎంసీల నీరు అవసరత ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఈస్టర్న్ డెల్టా చైర్మన్ సునీల్ కుమార్, డీఆర్వో సీతారామమూర్తి, ఆర్డీవోలు కృష్ణ నాయక్, రాణి సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు కృషి : ఎంపీ

కడియం/ధవళేశ్వరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పూల పరిశోధన కేంద్రంకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా కృషి చేస్తామని ఎంపీ పురందేశ్వరి తెలిపారు. వేమగిరి పూల పరిశోధనా కేంద్రంను బుధవారం పరిశీలించారు. పూల పరిశోధన కేంద్రం రీసెర్చి ఫార్మ్, లేబోరేటరీలను చూశారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ త్వరలో రైతులకు ఉపయోగపడే విధంగా ఉద్యాన అధికారులతో ఓ సమావేశం నిర్వహిస్తామన్నారు. శాస్త్రవేత్తలు డా. రాంపాల్, డా. లక్ష్మీపతి, డా. శిరీష, డా. మాధవన్ మాట్లాడుతూ రైతులకు జీవనియంత్రణ పద్ధతులపై వివరిస్తున్నట్టు తెలిపారు. ప్రతి నర్సరీ రైతు విధిగా తమ పేరును హార్టికల్చర్ ఏడీ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలన్నారు. ధవళేశ్వరంలో క్వాయర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని సందర్శించారు.



పూల పరిశోధన కేంద్రం పరిశీలనలో ఎంపీ

ప్యాకేజీ 2 పనులపై దృష్టి పెట్టండి..

రాజమహేంద్రవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాల దృష్ట్యా బుట్టాయగూడెం -ఎల్ఎన్‌డీ పేట- పట్టిసం -కొవ్వూరు (ఎన్‌హెచ్ 365బీబీ) రహదారి అభివృద్ధి ప్యాకేజీ-2 పనులను పూర్తి చేయాలని ఎంపీ పురందేశ్వరి ఆదేశించారు. కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో బుధవారం సమీక్షించారు.కేంద్ర ప్రభుత్వం తరఫున అవసరమైన అనుమతులు, సాంకేతిక ఆమోదాలు, నిధుల విడుదలపై సమన్వయం చేసే బాధ్యతను తాను స్వయంగా తీసుకుంటానని చెప్పారు. కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు చేసిన సూచనలను మినిట్స్ రూపంలో నమోదు చేసి వెంటనే సంబంధిత శాఖలకు పంపించాలన్నారు.ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, నాణ్యత నియంత్రణ అత్యవసరమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు.



రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి

అంబేడ్కర్ ఆశయాలు అనుసరణీయం

కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విలువలను అనుసరించి ప్రతి ఒక్కరూ నిబద్ధతతో కలిగి ఉండాలని కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘా స్వరూప్ అన్నారు. 76వ భారత రాజ్యాంగ దినోత్సవం కలెక్టరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు.1950 జనవరి 28న అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం, సమగ్రత, సమానత్వం, న్యాయం స్వేచ్ఛ, విలువలు ప్రతిబింబించే మహోత్తర గ్రంథం అన్నారు. మన భారత రాజ్యాంగాన్ని స్వీకరించడం మాత్రమే సరిపోదని అందులో నిర్దేశించిన విలువలను మన జీవన విధానంలో ఆచరిస్తేనే అది సాకారమవుతుందన్నారు. రాజ్యాంగం ఎంత మంచిదైనా దాన్ని అమలు పరిచే వారు చెడ్డవారైతే అది తప్పక చెడిపోతుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. రాజ్యాంగం ప్రతి అధికారికి ప్రతి పౌరుడికి స్పష్టమైన విధులు..బాధ్యతలు నిర్దేశించిందని మేఘస్వరూప్ అన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌వో సీతారామమూర్తి, కె.భాస్కర్‌రెడ్డి, డీఈవో వాసుదేవరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జ్యోతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎ వాణి పాల్గొన్నారు.



నిడదవోలు పురపాలక సంఘం వజ్రోత్సవ వేడుకలలో భాగంగా బుధవారం స్థూపం ఆవిష్కరిస్తున్న మంత్రులు నారాయణ, దుర్గేష్, కలెక్టర్ కీర్తి చేకూరి , ఆర్డీవోలు, నాయకులు ఉన్నారు..

2026 జూన్ చివరికి టిడ్కో గృహాలిస్తాం

పురపాలక శాఖా మంత్రి నారాయణ

నిడదవోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో గృహాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరి నారాయణ అన్నారు. నిడదవోలు పురపాలక సంఘం ఏర్పడి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరుగుతున్న వజ్రోత్సవ వేడుకలకు బుధవారం హాజరైన ఆయన టిడ్కో గృహాలు పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 163 ప్రాంతాల్లో టిడ్కో గృహాలు ఉన్నాయని..టిడ్కో ప్రాజెక్ట్ పూర్తవడానికి రూ.7 వేల కోట్లు అవసరం అవుతాయన్నారు. ఈ డిసెంబరు 3,4 తేదీల నుంచి టిడ్కో గృహాల నిర్మాణాలు పూర్తి చేసి 2026 జూన్ చివరి నాటికి లబ్ధిదారులకు అందిస్తామని తెలిపారు. 2014-19 కాలంలో టీడీపీ ప్రభుత్వం 7 లక్షలకు పైగా టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు మంజూరు చేసిందన్నారు. 5 లక్షల ఇళ్లకు పరిపాలన అనుమతులు ఇవ్వగా 4.94 లక్షల ఇళ్లను గ్రౌండ్ చేశామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఇళ్లను అర్ధంతరంగా ఆపేసిందన్నారు. టిడ్కో గృహాలు లబ్ధిదారులకు ఇచ్చినట్టు కాగితాల్లో చూపించి లోన్లు తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.140 కోట్లు పెండింగ్ లోన్లు తిరిగి బ్యాంకులకు చెల్లించామన్నారు. ఇదిలా ఉండగా నిడదవోలు నియోజకవర్గంలో కూటమి నేతల మధ్య విభేదాలు రచ్చ కెక్కుతున్నాయి.నిడదవోలు పురపాలక సంఘం వజ్రోత్సవ వేడుకల వేదికగా బహిర్గతం అయ్యాయి.వేడుకలకు టీడీపీ నాయకులు,కార్యకర్తలు దూరంగా ఉండడం గమనార్హం.

వరకట్నం తీసుకోవడం చట్టరీత్యా నేరం

● కొవ్వూరు సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి

కొవ్వూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరకట్నం తీసుకోవడం చట్టరీత్యా నేరమని కొవ్వూరు సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి అన్నారు. బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాపవరం తిరుమల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబరు 26వ తేదీన రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని, అప్పటి నుంచి ప్రతి సంవత్సరం రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. రాజ్యాంగం రచనకు ఎంతోమంది మహానుభావులు కృషి చేశారన్నారు. అనంతరం విద్యార్థులకు భారత రాజ్యాంగంపై డిబేట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు వై.ప్రకాష్, వీరంశెట్టి రాజా వరప్రసాద్, వి.హరీష్, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన విగ్రహాల ప్రతిష్ఠకు హోమాలు



తాడిపర్రులో హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తాడిపర్రులో గురువారం పార్వతీ సోమేశ్వరస్వామి వారి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన విఘ్నేశ్వరస్వామి, పార్వతీదేవి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కాల భైరవస్వామి, సూర్యభగవాను స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా బుధవారం వేదమంత్రాలతో హోమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. భక్తులు పాల్గొన్నారు.

కార్యకర్తల అభీష్టం మేరకే పార్టీ సంస్థాగత నిర్మాణం

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అబ్జర్వర్ అదిత స్వప్న



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొవ్వూరు నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల మనోభీష్టాన్ని తెలుసుకుని పార్టీ గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి సంస్థాగత నిర్మాణం జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా పరిశీలకుడు, జార్ఖండ్ మాజీ ఎమ్మెల్యే అదిత స్వప్న, ఏఐసీసీ కార్యదర్శి అంబా ప్రసాద్ అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుల ఎన్నికల్లో భాగంగా బుధవారం కాపవరంలో ఏఐసీసీ సభ్యురాలు అమర్ జహా బేగ్ స్వగృహంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ అన్ని పార్టీలకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా పార్టీ అధ్యక్ష పదవి ఎన్నిక కార్యకర్తల అభిప్రాయం మేరకు జరుగుతుందన్నారు. పార్టీని నిలబెట్టింది కార్యకర్తలే అని, వారి అభిప్రాయాలకు విలువ ఉంటుందని, నిరభ్యంతరంగా వారి అభిప్రాయాలు తెలపవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి, నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జి మేడవరపు భద్రం దొర, పార్టీ నాయకులు ఎండీ ఫనీ, బచ్చు బుజ్జిబాబు, సుంకర వెంకటేశ్వరరావు, మట్టా సుబ్బారావు, గెల్లా బాస్కరరావు, పాలగుర్తి మణి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మదనగోపాలస్వామి గుడికి బీరువా బహూకరణ



మదనగోపాలస్వామి ఆలయానికి బీరువా బహూకరిస్తున్న దాతలు భవాని, శ్రీనివాస్

నల్లజర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అనంతపల్లి రుక్మిణీ, సత్యభామసమేత మదనగోపాలస్వామి ఆలయానికి అదే గ్రామానికి చెందిన సీహెచ్ భవానీశేఖర్, పిసిని శ్రీనివాసరావు రూ.15వేలు విలువ చేసే ఇనుప బీరువాను బుధవారం బహూకరించారు. ఆలయ అర్చకులు దివి పాండు రంగశర్మకు బీరువాను అందజేశారు. స్థానికులు సూర్నీడి కిషోర్, దాసు రాజా, చందూరి రామకృష్ణ ఉన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

అనపర్తి నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేతృత్వంలో రాజ్యాంగ రచన జరిగిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామవరంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్ రత్నకుమారి



నిడదవోలులో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

● పలుచోట్ల అంబేడ్కర్ విగ్రహాలకు నివాళి అర్పించిన నాయకులు, ఉద్యోగులు, తదితరులు

కొవ్వూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మనిషి స్వేచ్ఛాయుత జీవనం గడపేందుకు రాజ్యాంగం మనకు ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రపంచ మేధావి డా.బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం 66 సంవత్సరాలు పూర్తయ్యిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మేనేజర్ భరత్‌కుమార్, టీపీవో టి.మణిరామ్, ఏఈ సుమంత్, భరత్, ఫణి, ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ కార్యాలయంలోనూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ సెంటర్‌లో...

కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నియోజకవర్గ కన్వీనర్ తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కోడూరి శివరామకృష్ణ, కంటమణి రమేష్‌బాబు, కవల నాగేశ్వరరావు, రుత్తల భాస్కరరావు, నాయకులు పాల్గొన్నారు.

నిడదవోలు: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను మనమంతా మననం చేసుకోవాలని రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలు పురపాలక సంఘ వజ్రోత్సవ వేడుకల సందర్భంగా సంత మార్కెట్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబరు 26న అంటే ఈ రోజు దేశ రాజ్యాంగం రాసిన రోజని, ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగాల్లో ఒకటైన భారత రాజ్యాంగాన్ని రాసిన అంబేడ్కర్ అందరికీ ఆదర్శ ప్రాయుడన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఆర్డీవో రాణీసుస్మిత, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కృష్ణవేణి, కౌన్సిలర్లు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రముఖులు మాట్లాడుతూ నవంబరు 26వ తేదీ రాజ్యాంగాన్ని ఆమోదించిన దినమని ప్రతి పౌరుడు రాజ్యాంగం అందించిన ప్రాథమిక హక్కులు, విధులను గురించి తెలుసుకోవాలన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఉమా రాజ్యలక్ష్మి పద్మజ, కానూరులో సర్పంచ్ భావన మధు, సచివాలయ సిబ్బంది ముక్కామల గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: భారత రాజ్యాంగం దేశానికి దిక్సూచీ లాంటిదని ఎంపీడీవో జీ.రాజమనోహర్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈఓపీ ఆర్డీ ఆర్.సుజాత, ఏవో మంగతాయారు, ఏపీఎం రోజ్‌మాణిక్యం, టీడీపీ మండల అధ్యక్షుడు కొర్లపాటి శ్రీరామచంద్రరావు, ఏఎంసీ డైరెక్టర్ కూనపం ప్రసాద్‌బాబు, టీడీపీ నాయకులు జ్యేష్ట శ్రీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి: రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని దేవరపల్లి బీహెచ్ఎస్ఆర్ అండ్ వీఎల్ఎం కళాశాల కరస్పాండెంట్ సువర్ణరాజు పేర్కొన్నారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీడీఎస్ కుమార్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.విక్రమ్, ఏవో ఆనంద్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఎంపీపీ దుర్గారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన రాజ్యాంగం పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యాక్రమంలో ఎంపీడీవో సీహెచ్ నాగార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో వై.రాజారావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ శాంతి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజ్యాంగం పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండి రాజ్యాంగ స్ఫూర్తిని పొందాలని దేవరపల్లి సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు పేర్కొన్నారు. బుధవారం రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు భారత రాజ్యాంగ సహకారం పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జే.శ్రీవల్లికాకు రూ.వెయ్యి, ద్వితీయ బహుమతి ఈ.నాగజ్యోతికి రూ.800, తృతీయ స్థానం సాధించిన డీకే.సతీశ్‌కు రూ.600 నగదు బహుమతి సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు, సొసైటీ సీఈఓ కల్లూరి శ్రీనివాస్‌శర్మ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపధ్యాయులు పేరం రవీంద్రనాథ్, టీడీపీ నాయకులు కడిమి శ్రీరామకృష్ణ, కాట్రగడ్డ మోహన్, నందిగాం శ్రీధర్, పిన్నమనేని నవీన్, సొసైటీ సిబ్బంది గుడ్ల వెంకటేశ్వరరావు, మణికంఠ, రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: భారత రాజ్యాంగ దినోత్సవం బుధవారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఉండ్రాజవరం ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వివిఎస్ రామారావు, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్, ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో సక్సేనరాజు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ ప్రతిజ్ఞ చేసారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు వద్ద సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.



గోపాలపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో, కూటమి నాయకులు



ఉండ్రాజవరం తహశీల్దార్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

లక్ష్మీ రమణి పాదయాత్రకు సంఘీభావం

నల్లజర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు 2024 ఎన్నికల్లో అఖండ విజయం సాధించి ముఖ్యమంత్రి స్థానంగా ఉండాలని కోరుకున్న ద్వారకాతిరుమల జడ్పీటీసీ లక్ష్మీ రమణి తమ మొక్కును తీర్చుకుంటున్నారు. ద్వారకాతిరుమల వెంకన్న సన్నిధి నుంచి సింహాచల క్షేత్ర దర్శనం నిమిత్తం పాదయాత్రగా బుధవారం బయలుదేరారు.నల్లజర్ల మీదుగా అనంతపల్లి మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్ ఇంటి వద్దకు పాదయాత్రగా చేరుకుని కొంతసేపు విశ్రాంతి తీసుకున్నారు. పాదయాత్రకు మండల టీడీపీ నాయకులు,కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం తెలియజేశారు. అనంతపల్లి నుంచి వీరవల్లి టోల్‌ప్లాజా వరకు అమెతోపాటు పాదయాత్ర చేసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో గన్నమని కృష్ణ మోహన్,దాసు రాజా, కోళ్ల సతీష్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా విశాఖాభివృద్ధి



సింహాచలం ఆలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి, తదితరులు

గోపాలపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం అభివృద్ధి రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ పని చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. బుధవారం విశాఖపట్నంలో ఆయాశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షాసమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశాఖను భారతదేశంలోనే ఒక ప్రత్యేకమైన నగరంగా అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్‌కు అభివృద్ధిలో ముఖద్వారం లాంటిదన్నారు. విశాఖ అభివృద్ధికి ప్రతిఒక్కరూ తనవంతు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు. మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. విశాఖ అభివృద్ధికి సంబంధించి ఏమేమి కావాలి నిధులు ఎలా ఖర్చు చేయాలి, అభివృద్ధిలో ఎలా ముందుకు వెళ్లాలి అనే అంశాల పై చర్చించినట్లు తెలిపారు. విశాఖలో అనేక పరిశ్రమలు వచ్చి ఎంతోమందికి ఉపాధి కలిగే అవకాశం ఉందన్నారు. విశాఖపట్నం సర్వతో ముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలకు సంబంధించిన అంచనాలకు సం బంధించిన నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా షష్ఠి వేడుకలు



కొవ్వూరు : ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

● కొవ్వూరులో ఎంపీ, ఎమ్మెల్యే పూజలు

కొవ్వూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. దీనికి పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వేకువజాము నుంచే గోష్పాదక్షేత్రంలోని గోదావరి నదికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం రావిచెట్టు వద్ద నాగశిలలకు పాలాభిషేకాలు చేశారు. తర్వాత సుందరేశ్వరస్వామి ఆలయంలో వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారిని దర్శించుకుని పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అలాగే గోదావరి గట్టుపై సుబ్రహ్మణ్య స్నానఘట్టం వద్ద వేంచేసియున్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పట్టణ సీఐ పి.విశ్వం పూజలు చేశారు. ఆలయ ఈవో ఎం.బాలకృష్ణ శాలువాలు కప్పి సత్కరించారు. భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు బారులుతీరి సుబ్రహ్మణ్య స్వామి దర్శించుకున్నారు. సాయంత్రం 6-30 గంటలకు ఆలయ ఈవో ఎం.బాలకృష్ణ ఆధ్వర్యంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. షష్ఠి ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ పి.విశ్వం, ఎస్ఐ పి.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పెరవలి: సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో సుబ్రహ్మణ్య ఆలయాల్లో భక్తులు దైవదర్శనం చేసుకున్నారు. కానూరులో గల ఆలయాన్ని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు దర్శించుకున్నారు. కానూరు అగ్రహారం, తీపర్రు, కాకరపర్రు, పెరవలి, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు, తదితర గ్రామాల్లో అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చాగల్లు: మండలంలో సుబ్రహ్మణ్యస్వామి వారి షష్ఠి వేడుకలు వైభవంగా జరిగాయి. చాగల్లు సెంటర్‌లోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో వారి కళ్యాణం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారు అమ్మవార్లకు విశేష పూజలు జరిగాయి. అనంతరం స్వామి వారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం జరిగింది.

తెల్లవారు జామునుంచి స్వామి వారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలో కోలాట భజన నిర్వహించారు. భక్తి పాటలతో కోలాట నాట్యం చేస్తూ భజన బృందం చేసిన కోలాట భజన విశేషంగా ఆకట్టుకుంది. చిక్కాల, ఊన గట్ల, బ్రాహ్మణగూడెం తదితర గ్రామాలలోను షష్ఠి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దేవరపల్లి: షష్ఠి మహోత్సవాల్లో భాగంగా మండలంలో అన్ని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు బుధవారం తెల్లవారుజాము నుంచి పోటెత్తారు. దేవరపల్లి శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మ ణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేకపూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. త్యాజంపూడి, పల్లంట్ల, చిన్నాయిగూడెం, గౌరీపట్నం, దుద్దుకూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద షష్ఠిమహోత్సవాల్లో భాగంగా భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లో షష్ఠి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండ్రాజవరంలోని వల్లిదేవసేన సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. దేవాలయ ప్రాంతాన్ని, అన్నప్రసాదాల పంపిణీ ఆయన పరిశీలించారు. వేదమంత్రాలతో తొలుత ఆలయకమిటి స్వాగతం పలికింది. భక్తులు తెల్లవారుజామునుంచి క్యూలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, మాజీ సర్పంచ్, టీడీపీ నేత గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు పాల్గొన్నారు. వేలివెన్ను సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసారు.



ఉండ్రాజవరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శించుకున్న మంత్రి దుర్గేష్

క్రమశిక్షణ కలిగిన పార్టీ కాంగ్రెస్

● ఏఐసీసీ కార్యదర్శి, తూర్పుగోదావరి జిల్లా పార్టీ పరిశీలకుడు అంబా ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి అంబా ప్రసాద్ , తదితరులు

దేవరపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ పార్టీ చేయనటువంటి పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను ఎన్నుకోవడం జరుగుతుందని ఏఐసీసీ కార్యదర్శి, తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు అంబా ప్రసాద్ పేర్కొన్నారు. దేవరపల్లి మండలం దుద్దుకూరులో రాష్ట్ర కిసాన్‌సెల్ ఉపాధ్యక్షులు కాకర్ల హరిబాబు ఇంటి వద్ద గోపాలపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు అభిప్రాయ సేకరణకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబా ప్రసాద్ మాట్లాడు తూ కాంగ్రెస్ పార్టీకి ఎంతో ఘనచరిత్ర ఉందని, క్రమశిక్షణ కలిగిన జాతీయపార్టీగా కాంగ్రెస్ పార్టీకి భారత దేశ ప్రజలకు విశేష సేవలందిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా అధ్యక్షుల ఎన్నిక విషయంలో కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇస్తా మన్నారు. వచ్చే ఆసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దేశంలో అన్ని రాష్ట్రాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయడం జరుగు తుందన్నారు. లోక్‌సభ ఆసెంబ్లీ అధ్యక్షుల ఎన్నికలో కార్యకర్తలు, ప్రజల అభిప్రాయ సేకరణ చేసి నిర్ణయి స్తామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కార్యకర్తలు, నాయకులు సమావేశం నిర్వహించటం జరుగుతుందన్నారు. ముందుగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి అంబాప్రసాద్ ఇన్‌చార్జి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అతిథి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్ ఎం.బాబ్జీ, అధ్యక్షులు టీ.విశ్వేశ్వరరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి మార్టిన్ లూదర్, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఎండీ.రఫీ ఉల్లాబేగ్, ఏఐసీసీ సభ్యురాలు అమర్జహాబేగం మహ్మద్, కాంగ్రెస్ నాయకులు పాకా చిన్నబ్బాయి, కాకర్ల శ్రీహరిబాబు, వెలగా రామకృష్ణ, ఎం.శారద, ఎస్.లలిత, మేడవరపు భద్రందొర, డాక్టర్ వడయార్, విల్లూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏఐసీసీ అంబా ప్రసాద్‌ను, అతిథులను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు.

నిడదవోలును స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా మారుస్తాం

● వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి నారాయణ ప్రకటన
● కూటమి ప్రభుత్వంలో పురపాలక సంఘంలో రూ. 151 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు : మంత్రి దుర్గేష్



మాట్లాడుతున్న మంత్రి పొంగూరి నారాయణ

నిడదవోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పురపాలక సంఘ వజ్రోత్సవ వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని , దీన్ని స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తామని, ఉత్సవాలు పూర్తయ్యే నాటికి (ఈ నెల 28వ తేదీ) సాయంకాలానికి మున్సిపాలిటీ అప్‌గ్రేడ్ జీవో కాపీని అందిస్తామని పురపాలక శాఖా మంత్రి పొంగూరి నారాయణ ప్రకటించారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని ఐ లవ్ నిడదవోలు పార్కు వద్ద నిడదవోలు వజ్రోత్సవ చిహ్నాన్ని మంత్రి దుర్గేష్‌తో కలసి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన వజ్రోత్సవ వేడుకల వేదికపై ఆయన మాట్లాడుతూ నిడదవోలు పట్టణానికి పూర్వవైభవం తీసుకురావడానికి కలసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి కందుల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే 400 కోట్ల రూపాయిలతో నిడదవోలు నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చామన్నారు. ఒక్క నిడదవోలు పట్టణంలోనే రూజ 151 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, త్వరలో నిడదవోలును అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పరుస్తామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఆలోచనలకు అనుగుణంగా పట్టణాన్ని అభివృద్ధి పరచడంలో తాను ప్రజా సేవకుడిగా పనిచేస్తున్నాన్నారు. త్వరలోనే నిడదవోలు ప్రజలకు గోదావరి జలాలను అందించడంతో పాటు మినీ స్టేడియం ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటున్నానన్నారు. అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టులో అంతర్భాగంగా రూ. మూడు కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణాభివృద్ధికి మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కృష్ణవేణి, కౌన్సిలర్లు కష్టపడి పనిచేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. సభా వేదికపై సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జునరావు రచించిన నిడదవోలు చరిత్ర పుస్తకాన్ని మంత్రులు నారాయణ, దుర్గేష్, తదితరులు ఆవిష్కరించారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఆర్డీవో రాణీసుస్మిత, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎంతో సంతృప్తినిచ్చింది

● రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్

నిడదవోలు పురపాలక సంఘ వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొనడం సంతప్తినిచ్చిందని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఐ లవ్ నిడదవోలు పార్కు వద్ద ఉన్న వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలకు మంత్రి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ తోట కృష్ణవేణి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.